RSVMOIA 1199 C

ఓం

గ్రంథాలయసర్వస్వము.

ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘపక్షమున ప్రకటింపబడు

సచిత్ర మాసపత్రిక

సంపు. ౯ } బెజవాడ జనవరి ౧౯౩౫ { సంచిక ౪

అయ్యంకి వేంకటరమణయ్య,

సంపాదకుడు.

౧ వాయువు ఎల్లవారికి ఎట్లు స్వాధీనమై యున్నదో
జ్ఞానముకూడ అట్లు స్వాధీనము కావలయును
౨ ఉదకము ఎల్లవారికి ఎట్లు సేవ్యమై యున్నదో
జ్ఞానముకూడ అట్లు సేవ్యము కావలయును
౩ సూర్యచంద్రమండలముల తేజస్సు ఎల్లవారికి
ఎట్లు సౌఖ్యప్రదముగా నున్నదో అట్లే
జ్ఞానముకూడ సౌఖ్యప్రదము కావలయును

— చిలకమర్తి లక్ష్మీనరసింహము.

వార్షికమూల్యము : సభ్యులకు రు 3-0-0

ఇతరులకు రు ౫-0-0

విడిసంచిక రు 0-౪-0

హిందూయువజనసంఘము, అన్న, వస్త్ర, వైద్య, విద్యాదాన సమాజము, గోసంరక్షణసమితి (ఏలూరు.)

ధర్మకార్యముల శాశ్వతసభ్యుల తరగతులు.

	రు		
(1) శాశ్వత ధర్మకర్తలు	500	(5) నె 1 రు శాశ్వత సభ్యులు	100
(2) శాశ్వత పోషకులు	250	(6) నె 2 రు శాశ్వత సభ్యులు	68
(3) శాశ్వత సహాయులు	180	(7) నె 3 రు శాశ్వత సభ్యులు	35
(4) శాశ్వత అభిమానులు	150	(8) నె 4 రు శాశ్వత సభ్యులు	20
		(9) నె 5 రు శాశ్వత సభ్యులు	10

ఆదానుబట్టి ధర్మములు జరుగుటకు పైన తెలిపినప్రకారం శాశ్వతనిధికి ధర్మముయిచ్చి క్రమేణా హెచ్చుతరగతులుగా హోదాలకుచేరవచ్చును. ఇట్టిధర్మములకు రశీదులును యివ్వబడును. ప్రత్యేక పట్టాలనుకూడా అయిదుగురకు తక్కువకాని శాశ్వత ధర్మకర్తల సంతకములతో నిచ్చెదరు. శాశ్వతధర్మకర్తలకు వారు యిచ్చు ఛాయాపటము (Oil painting or enlargement) కార్యస్థానమున అలంకరించెదరు. వారు ఫోటోబ్లాకులు (Half tone block) యిచ్చిన సంవత్సర రిపోర్టులలో ముద్రించెదరు. ఎల్లరు యథాశక్తిని సహాయముచేసి, పుణ్యము సంపాదించ గోరెదను.

ఇతరవివరములకు :—

ప్రెసిడెంటు, వైస్‌ప్రెసిడెంటు, సెక్రిటరీలలో నెవరికైనను వ్రాయవచ్చును.

ఏలూరు గోసంరక్షణసమితి ప్రచురములు

సమితితరఫున అచ్చువేయించబడి ఉచితముగ పంచిపెట్టబడిన గ్రంథములు 6 కలవు.

గ్రంథముల వివరము.

(1) గోప్రభావము—బ్ర॥శ్రీ॥ మహామహోపాధ్యాయ ముదిగొండ నాగలింగశాస్త్రిగారు (తెనాలి)
(2) గోవు — మ॥ రా॥ శ్రీ బొడ్డు బాపిరాజు శ్రేష్ఠిగారు (ఏలూరు)
(3) కామధేనువు—మ॥రా॥శ్రీ కొత్తపల్లి సుందరరామయ్యగారు (లక్కవరం విద్వాంసులు)
(4) గోమహిమ — మ॥ రా॥ శ్రీ చింతపెంట వేంకటరమణయ్యగారు (మానేపల్లి)
(5) గోమాత — మ॥ రా॥ శ్రీ గొట్టుముక్కల రామకృష్ణశాస్త్రిగారు (నడకుదురు)
(6) మూగతల్లి — (Dumb mother) గోమాతను గూర్చిన కావ్యఖండము ప్రకీర్ణము (తొమ్మండుగురు కవీశ్వరులు)

I

సంచార గ్రంథాలయశకటము



కౌమారగురుకులము,

మన్నారుగుడి.

ప్రణమ్య శిరసా దేవీం భుక్తిముక్తి ఫలప్రదాం,
ప్రణమ్య స్తౌమి తామేవ జ్ఞానశక్తిం సరస్వతీమ్.

౯-వ సంపుటము

గ్రంథాలయసర్వస్వము.

౪-వ సంచిక.

జనవరి 1935

ఎనిమిదవ

అఖిలభారత గ్రంథాలయ మహాసభ.

1934 సం॥ డిసెంబరు 24, 25, 26 తేదీలు మద్రాసు

అఖిలభారతగ్రంథాలయమహాసభ 24 తేదీన కాంగ్రెసుభవనమునసమావేశమయ్యెను. వంగరాష్ట్ర గ్రంథాలయ సంఘాధ్యక్షులగు కుమారమణీంద్ర దేవ్ రాయి (ఎం. ఎల్. సి.) గారు అధ్యక్షత వహించిరి. భారతదేశము నందలి చాలప్రాంతములనుండి పెక్కుమంది ప్రతినిధు లరుదెంచిరి.

ఆహ్వాన సంఘాధ్యక్షుని ఉపన్యాసము.

ఆహ్వానసంఘాధ్యక్షులు శ్రీయుత కస్తూరి లక్ష్మీనరసింహారావుగారు, ప్రతినిధులకు హృదయపూర్వక మగు స్వాగత మొసగుచు, అఖిలభారత గ్రంథాలయోద్యమమునకును చెన్నపట్టణమునకును గలసంబంధము నుదాహరించిరి. మొట్టమొదటి అఖిలభారతగ్రంథాలయ సమావేశ మీపట్టణముననే జరిగెను. అఖిలభారతగ్రంథాలయ సంఘమునకు

మొట్టమొదట నీపట్టణముననే పునాదివేయ బడెను. తిరిగి 1927 సం॥ న అఖిలభారత గ్రంథాలయసభ ఈపట్టణముననే రెండవ మారు సమావేశ మయ్యెను. ఆ సమయ ముననే నేటివరకునుగూడ జయప్రదముగ పనిచేయుచున్న మదరాసురాష్ట్రీయగ్రంథా లయముల సంఘము స్థాపింపబడెను. ఈ మహాసభ, చెన్ననగరమున సమావేశమగుట కిది మూడవతూరి. రాష్ట్రీయగ్రంథాలయ సమితి నేర్పరచుటకు చెన్నరాష్ట్రమే ప్రథ మము. రాష్ట్రమునందలి గ్రంథాలయ సంఘములన్నియునుగూడ ఈ సమితియందు చేరి బలపరుపవలెను. ఇటీవల రాజకీయపరి స్థితులవలన, మనరాష్ట్రమున, గ్రంథాలయ వ్యాప్తి తగినంత జరుగుట లేదుగాని ఇటీవల పరిస్థితులు మారుటచే, గ్రంథాలయస్థాపన లందుగూడకొంత చురుకుగ పనిసాగుచున్నది. అచిరకాలములోనే పాశ్చాత్యదేశములతోస రిసమానముగ మనదేశమునగూడ గొప్పగ్రం థాలయములు స్థాపింపబడునని నమ్మవచ్చును.

ఆహ్వానసంఘాధ్యక్షులు, గ్రంథాలయో ద్యమావశ్యకత నుదాహరించుచు, విద్యా ధికులలో వ్యాపించియున్న నిరుద్యోగసమ స్యను, దానిని వారించుటకు గల మార్గము లను చర్చించి, విద్యోపార్జనము జీవనోపాయ ముగ నవలంబించు స్వభావమును తొల గించి, జ్ఞానోపార్జనే పరమావధిగ నొనర్ప వలెనని కోరిరి. ఇందుకు గ్రంథాలయోద్య మము చాలవరకు తోడ్పడగలదు. విద్యాల యములందు విద్యోపార్జనము, చాల వ్యయ కరముగ నున్నది. అందుచే ప్రజాసామాన్య మున విజ్ఞానవ్యాప్తికి, గ్రంథాలయములు గావింపగల కృషి చాలగలదు. అచిరకాల ములోనే మనదేశమున, నూతనప్రజాప్ర తినిధ్యప్రభుత్వము జయప్రదముగ నమలు జరుగవలె ననినచో, అజ్ఞానాంధకారమున మునిగియున్న ప్రజాసామాన్యమున విజ్ఞాన మును వ్యాపింపజేయవలసియున్నది.

ప్రస్తుతము శాసనసభవారియెదుటనున్న గ్రంథాలయములచట్టమునుగురించి ప్రసం గించుచు, అది శాసనమగుటకు కావలసిన సాహాయ్యము నొనర్పవలసినదని ప్రభుత్వము వారిని గోరిరి.

కే. యం. అనదుల్లాగారు సమావేశప్రారంభము గావించుట.

కే. యం. అనదుల్లాగారు సమావేశ ప్రారంభోత్సవము సలుపుచు, ఇట్లు పలికిరి.

గ్రంథాలయ ఉద్యమము వర్తమాన కాలమున విద్యాభివృద్ధికిని, ప్రజలవిజ్ఞానాభి వృద్ధికిని ముఖ్యముగ తోడ్పడుచున్నను, ఉద్య మము అనుకొనినంత ప్రాముఖ్యము బడయ కుండుట విచారకరము. అచ్చటచ్చట విరివిగా గ్రంథాలయములను స్థాపించి వానిని నిర్వ హించుట చేయవలసినపనులలో అవశ్యమైన ది. భారతదేశమున విద్య యితరదేశములతో పాటు అభివృద్ధి గాంచియుండకపోయినను ఉన్న విద్యావంతులైనను స్థాపింపబడినగ్రం థాలయములను ఎక్కువ ఉపయోగించు కొనుట లేదని చెప్పవలెను. గ్రంథాలయ ఉద్యమమును ప్రసరింపజేయుట తమ ముఖ్య కార్యమైయున్నను విద్యావంతులైన ప్రజ లలో గ్రంథాలయములను వాడుకొనెడి వాం ఛను కలిగింపజేయుట అవశ్యకము. ఇందుకు

గాను గ్రంథాలయసంఘములనధికముగస్థాపించుట, సమావేశములు జరుపుట యవసరము.

గ్రంథాలయములనిర్వహణము, అందులకుగాను శిక్షణము పొందినవారిచేతిలో నుండవలెను. గ్రంథభాండాగారులకు శిక్షణమొసగ ప్రత్యేకపాఠశాలలు స్థాపించి వారికి తగిన శిక్షణ మొసగవలెను. ఇవియును మరి అనేక సమస్యలు పరిష్కరించుటకు గ్రంథాలయసంఘము లన్నియు శ్రద్ధ వహింపవలెనని కోరుచున్నాను.

అధ్యక్షోపన్యాసము.

కుమార మణీంద్రదేవ్ రాయిగారు, అధ్యక్షత వహించుచు ఆంధ్ర దేశమున గ్రంథాలయోద్యమము గాంచిన వ్యాప్తిని ప్రశంసించిరి. ప్రాచీనకాలమున నళందా, విక్రమశిల, తక్షశిలానగరములందు గల గొప్ప గ్రంథాలయముల నుదాహరించి ఆదర్శమందు నాటిగ్రంథాలయములకును, నేటి గ్రంథాలయోద్యమమునకును గల భేదములను వివరించిరి. నాటిగ్రంథాలయములు విద్యార్థులకు నుద్దేశింపబడినవి. నేటిగ్రంథాలయోద్యమము, జనసామాన్యమందంతను విజ్ఞానమును వ్యాపింపచేయుటకు యత్నించుచున్నది. ప్రజాసామాన్యమున గ్రంథపఠనాభిమానము వ్యాపింపచేయుట కుద్దేశింపబడినది.

కలకత్తాయందలి "ఇంపీరియల్" గ్రంథాలయమును, భారతదేశమున కంతకును కేంద్రగ్రంథాలయముగ నొనర్చుటకు గావింపబడుచున్న ప్రయత్నములు సఫలమగుగాక! యని ఆశించిరి. నూతన గ్రంథాలయముల స్థాపనమునుగురించి ప్రసంగించుచు, ఆయా స్థానిక పరిస్థితుల కనుకూలమగు పద్ధతులపై గ్రంథాలయములను స్థాపింపవలెనని నుడివిరి. ప్రభుత్వమువారు, సార్వభౌముని పరిపాలనా రజతోత్సవమును జరుపునపుడు దాని సంస్మరణార్థము కొన్నిగ్రంథాలయముల నేర్పరుపవలెనని హెచ్చరించిరి. ప్రజలు గ్రంథాలయముల నేర్పరుచుకొనుటలోను, గ్రంథాలయోద్యమములోనికి పాక్షిక విరోధముల నేమాత్రమును దరికి చేరనీయరాదనిరి. గ్రంథాలయములు, అవసరములనుబట్టి, గ్రంథములను పరస్పరము బదులిచ్చి పుచ్చుకొనుపద్ధతి నవలంబింపవలె ననిరి. కారాగారములలోని ఖయిదీలకును, వైద్యశాలలలోని రోగులకును, పామరజనులకునుగూడ ప్రత్యేకముగ గ్రంథాలయముల నేర్పరుచుట అవసర మనిరి.

రెండవదినము.

రెండవదినముఉదయమున అధ్యక్షులందరును కలిసి, మద్రాసునందలి గ్రంథాలయములనన్నింటిని దర్శించిరి. మధ్యాహ్నమున తిరిగి సభ జరిపి తీర్మానములను గావించిరి.

తీర్మానములు.

అన్నిరాజధానులలోను ధర్మగ్రంథాలయోద్యమమును వ్యాపింపజేయుటకు వివిధ రాష్ట్రములందలి చట్టనిర్మాణసభలు విశేషధనము నొసంగవలెనని యీసభవారు కోరుచున్నారు.

స్థానికసంస్థలును, పురపాలకసంఘములును తమపరిపాలనక్రింద ధర్మగ్రంథాలయములను స్థాపింపవలెనని యీ సంఘము వారు తీర్మానించుచున్నారు.

ధర్మగ్రంథాలయోద్యమమును వ్యాపింప జేయుటకు గాను జిల్లా, తాలూకా గ్రామ గ్రంథాలయసంఘములను నెలకొల్పవలసిన దని యీ సభవారు హెచ్చరించుచున్నారు.

చదువుకొన్న వారికి, చదువురాని వారికి జనసామాన్య మందఱకు విజ్ఞానవ్యాప్తి గలుగుటకును, గ్రంథాలయోద్యమము అందరి ఉద్యమములను నడుపవలసినదని గ్రంథాలయముల పరిపాలకులను హెచ్చరించుచున్నారు.

గ్రంథాలయసంఘములతో కలిసి పని జేయుటకు, వానిని పరిపాలించుటకును రాష్ట్రీయసంఘములను నిర్మించి, వానిని అఖిలభారత గ్రంథాలయసంఘమునకు శాఖలనుగా చేర్చవలసినదని, ఈ సభవారు హెచ్చరించుచున్నారు.

జనసామాన్యముయొక్క విద్యావ్యాపనమునకై దేశభాషాగ్రంథములను స్వీకరించి వానిని వ్యాపింపజేయుటకుగాను గ్రంథాలయములు విశేషప్రాముఖ్యము నొసంగవలెనని యీ సభవారు తీర్మానించుచున్నారు.

హిందూదేశమంతటను ప్రచురింపబడుచున్న వాఙ్మయము నంతను వివిధ రాష్ట్రీయ గ్రంథాలయములందును, ఇంపీరియలు గ్రంథాలయమునందును చేర్చియుండుట అత్యంతావశ్యకము గావున వానికి అన్ని గ్రంథములను ఉచితముగాను, నిర్బంధముగాను తెప్పించుకొనునధికారము నొసంగుట అవసరము.

గత రెండుసంవత్సరములందును గ్రంథాలయవారము జయప్రదముగా నిర్వహించినందులకు ఈసభవారు తమసంతసమును దెల్పుచు, సరస్వతీపూజలు, సభలు, ప్రదర్శనములు- స్థానిక గ్రంథాలయముల సాహాయ్యార్థము సొమ్ము వసూళ్ళు-ఇంకను గ్రంథాలయోద్యమవ్యాప్తికి కావలసిన ఇతర కార్యక్రమములను నిర్వహించి, ఆ వారమును ప్రతి సంవత్సరమును జరుపవలెనని యీ సభవారు హెచ్చరించుచున్నారు.

మన్నారుగుడి, కొప్పము, ఆలమూరులందు జరుగుచున్న గ్రామ గ్రంథాలయ సేవకు ఈ సభవారు తమ యామోదమును దెల్పుచు ఆరీతిగా నే దేశము నెల్లెడలను చేయవలెనని ఈ సభవారు కోరుచున్నారు.

(క) పట్టణములందును, పల్లెలయందును గ్రంథాలయములను వ్యాపింపజేయుటతో మాత్రము సంతుష్టినిజెందక కంటికి చూపుట, చెవికి వినిపించుటమూలమున చదువుకొన్న వారికి, చదువుకోని వారికి అందరికి జ్ఞానవ్యాప్తిని చేయవలెనని ఈసభవారి యభిప్రాయము.

(చ) భారతీయవిజ్ఞానముయొక్క ఘనతను గూర్చియు, వానియొక్క ఉపయోగమును గూర్చియు ఆంగ్లేయవిద్యాధికులకు తెలియజెప్పవలెనని ఈసభవారు హెచ్చరించుచున్నారు.

(ట) పై అభిప్రాయములను ఆచరణలో పెట్టుటకై ఈ క్రిందివారిని ఉపసంఘముగా నియమించిరి.

యస్. యస్. రాజగోపాలం, యం. ఏ. బి. ఎల్.
దాను త్రివిక్రమ రావుగారు, బారిష్టరు, సమావేశకులు.
కుమార మణీంద్రదేవ రాయి, అధ్యక్షులు.
కే. యం అసదుల్లా.
దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు
అయ్యంకి వేంకటరమణయ్య.
డాక్టరు బి. వి. నారాయణస్వామి, బారిష్టరు.
కే. యల్. నరసింహారావుగారు బి. ఏ., బి. యల్.

రావుసాహేబు యస్. వి. కనకసభాపిళ్లే,
వి. వి. గిరి, బారిష్టరు.
పురుషోత్తముగారు.

(త) విద్యార్థికులకును యువకులను గ్రంథాలయోద్యమవ్యాపకమునకై వినియోగించుటకు తగిన ప్రణాళికలను తయారుచేసి రాష్ట్రీయప్రభుత్వములకు పంపవలెను. అంతర్జాతీయగ్రంథాలయసభను భారతవర్షమున జరుపుటకై ఈసభవారు ఆహ్వానించుచున్నారు.

ప్రభుత్వమువారు కొన్నిగ్రంథాలయములకు వారిప్రచురములను ఉచితముగా ఇచ్చుచున్నందులకు ఈ సభవారు వందనములర్పించుచు, అన్నిగ్రంథాలయములకును ఇప్పించవలెనని కోరుచున్నారు.

గ్రంథభాండాగారులను తరబీతు చేయుటకై శిక్షాతరగతులను ఏర్పాటు చేసినందులకు ఈ సభవారు తమసంతుష్టిని గన్పరచుచు, దానిని ఇంకను ఎక్కువగా అభివృద్ధి కరచుటకు హిందూదేశమునందును, బర్మాయందునుగల విశ్వవిద్యాలయము లన్నియు తగిన తరగతులను పెట్టవలెనని ఈ సభవారు హెచ్చరించుచున్నారు.

అఖిలభారత గ్రంథాలయసంఘమును, భారత గ్రంథాలయసంఘమును కలిసి పనిచేసినయెడల, ఉద్యమము ఇంకను ఎక్కువ జయప్రదముగా వ్యాప్తియగును గావున, అట్టి పనికిగాను మార్గముల నన్వేషింపవలెనని యీ సభవారు, ఉభయసంఘముల కార్యనిర్వాహకవర్గములవారిని కోరుచున్నారు.

దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావుగారును, వావిళ్ళ వేంకటేశ్వరశాస్త్రిగారును, గ్రంథాలయోద్యమమునకు చేయుచున్న సేవను గుర్తించి, వారి కీసభవారు ఈక్రింది బిరుదముల నిచ్చి సత్కరించుచున్నారు.

దేశోద్ధారక కాశీనాథునినాగేశ్వరరావుగారు
జ్ఞానదాత
వావిళ్ళవేంకటేశ్వర్లుగారు, ఆంధ్రభాషోద్ధారక

లాహోరు గ్రంథాలయసేవకులగు ఏ. కే. సిద్ధాంతగారి అకాలమరణమున కీ సభవారు తమవిచారమును దెల్పుచున్నారు.

విందులు.

ప్రతినిధులకు 24 వ తేదీని క్రిసెంటు లైబ్రరీవారును, 25 వ తేదీని దివాన్ బహాద్దరు, జి. నారాయణస్వామిగారును అల్పాహారవిందుచు గావించిరి.

రేపల్లెతాలూకా గ్రంథాలయ మహాసభ

పెదపులివర్రు 15—11—34.

14 వ నవంబరు మధ్యాహ్నము 2 గం॥లకు రేపల్లెతాలూకా ద్వితీయగ్రంథాలయ మహాసభ ఆంధ్రరాష్ట్రీయగ్రంథాలయసంఘ కార్యదర్శిగారగు శ్రీయుత అయ్యంకి వేంకటరమణయ్యపంతులుగారియధ్యక్షతక్రింద పెదపులివర్రు బాలగంగాధరతిలక్ పుస్తక భాండాగారపు త్రయోదశ వార్షికోత్సవమునకొరకు వేయబడినపందిరిలో జయప్రదముగా జరుప

బడెను. తాలూకాలోని వివిధ గ్రంథాలయ ప్రతినిధులు పలువురు విచ్చేసిరి. రిటైర్డు డిప్యూటీ కలెక్టరుగారగు రావుసాహేబు శ్రీయుత వట్టెంభోగప్పయ్యశాస్త్రిగారిచే మహాసభా కార్యక్రమము ప్రారంభింపబడెను.

వి. యల్. శాస్త్రిగారు, గ్రంథాలయోద్యమమును గూర్చి గంభీరోపన్యాసము నొసంగిరి.

ఏడిద వీరభద్రరావు పంతులు బి. ఏ., బి. యల్., గారు గ్రంథాలయోద్యమమును గూర్చి విపులముగా ముచ్చటించిరి. బీరువాలలో గ్రంథము లుండిన ఉపయోగము లేదనియు గ్రంథరాజములను ఉపయోగింపచేయుట స్త్రీపురుషులకు ముఖ్యావసరమనియు సెలవిచ్చిరి.

అధ్యక్షోపన్యాసము.

తరువాత అధ్యక్షులవా రుపన్యసించుచు గ్రంథాలయోద్యమము భీమవరము తాలూకాలోను, రేపల్లెతాలూకాలోను ఎక్కువగా కొనసాగుట ప్రశంసనీయమని సెలవిచ్చిరి నవీన కాలములో గ్రంథాలయములు, గ్రంథములు పోగుచేయబడినదుకాణములు కావనిరి. గ్రంథాలయములోని పుస్తకములు చదువకుండ నుండిన ఇంపీరియల్ బ్యాంకులో డబ్బున్నట్లే యని చెప్పిరి. మరియు, పాశ్చాత్య దేశములలో విజ్ఞానవ్యాప్తి నింకను ఎక్కువతీవ్రతిగాసాగించుటకై గ్రంథములను గ్రామోఫోనులయందెక్కించివినుపించుచున్నారని, గుడ్డివారికి కూడ ఈపద్ధతి మిక్కిలియుపయోగముగా నున్నదనియు ఒకగ్రామమందలిజనులందరును గ్రంథాలయముయొక్క ఉపయోగమును పొందుచున్నగాని దేశమునకు మోక్షము లేదనియు జెప్పిరి.

తీర్మానములు.

తదుపరి మహాసభలో ఈదిగువ తీర్మానములు పెట్టబడి యేకగ్రీవముగా నామోదింపబడెను.

1. ఈతాలూకాలోని అడవులదీవిగ్రంథాలయకార్యదర్శియగు రాజ వెంకట నరసింహారావుగారును, శిరిపూడి గ్రంథాలయాధ్యక్షులగు యల్లాప్రగడ జగన్నాథరావుగార్ల నిర్యాణములకు చింతిల్లుచు వారియాత్మలకు శాంతి కలుగుగాక యని యీ సభవారు ప్రార్థించుచున్నారు.

2. ఈతాలూకాలోని గ్రంథాలయములు లేని గ్రామములవారు తాలూకాగ్రంథాలయ సంఘమువారిసలహాలను తీసికొని వారిగ్రామములలో నూతనగ్రంథాలయములను స్థాపించుటకు హెచ్చరించుట యైనది.

3. మాసవారీ నివేదికలను పంపుటలో అశ్రద్ధ వహించినగ్రంథాలయములవారు కడు శ్రద్ధతీసికొని ప్రతి నెల 5 వ తేదీలోగా నివేదికలను తాలూకాసంఘమువారికి పంపగలందులకు కోరుట యైనది.

4. దసరాపండుగదినములలో గ్రంథాలయ మహోత్సవమును ప్రతిగ్రంథాలయనిర్వాహకులును జరిపించగలందులకు కోరుటయైనది.

5. తృతీయ రేపల్లెతాలూకాగ్రంథాలయ వార్షికమహాసభను ఐలవరం శ్రీశారదా గ్రంథనిలయమువారు తమనిలయమున జరిపించుటకు ఆహ్వానించినందున ఆహ్వానమును అంగీకరించుట యైనది.

హిందూయువజన సంఘము, ఏలూరు

29 వ వార్షికోత్సవము.

ఈగ్రంథాలయముయొక్క వార్షికోత్సవము 21-10-34 తేదీన యం. లక్ష్మీనరసప్ప, యం. ఏ., ట్రెజరీ డిప్యూటి కలెక్టరుగారి అధ్యక్షతక్రింద మిక్కిలి వైభవముగా జరిగినది. అప్పుడు చదువబడిన గ్రంథాలయము యొక్క నివేదికను ఈక్రిందవివరించుచున్నాము

సంఘ చరిత్ర.

ఈ సంఘము 30 సంవత్సరముల క్రితము ది 23-9-1904 వ తేదీని ఉత్సాహవంతులగు యువకులచే ఏలూరు దక్షిణపువీధిన స్థాపింపబడెను. ఈసంస్థానముచేసిన అమృతహస్తుడగు కీ. శే. దుగ్గిరాల సత్యనారాయణమూర్తిగారి సేవ ఈ గ్రంథాలయజీవనమునకు శ్రీకారమయినది. ఆయన మనకెల్లరకు చిరస్మరణీయుడు. ది 6-11-1918 సం॥న ఈసంఘము రిజష్టరుచేయబడెను. వితరణశీలుడును, వినయభావుడును, ధర్మకర్తసభాధ్యక్షుడునగు రా॥ బ॥ మోతే గంగరాజు జమీందారుడు ఏబది వేలరూప్యములు వెచ్చించి 1929 సం॥ న ఈ దివ్యభవనమును దానమొసంగి తనఔదార్యమును ప్రకటించెను.

పరీక్షలు:- ఈసంఘపక్షమున 6 వతరగతి మొదలు 11వ తరగతివరకు విద్య నభ్యసించుచున్న బాలబాలికలకు వ్యాసరచనాపోటీ పరీక్ష జరుపబడెను. 178 బాలురు 2 బాలికలును హాజరు అయిరి.

నీతిదాయకమగు నొకకథ-వ్యాయామము-విద్యార్థులు, వారివిధులు - గ్రంథపఠనము- కాలవిభాగము - సంఘసేవ - అనువిషయములందుపరీక్షింపబడినది; పదునొకండు బాలురకును,ఒకబాలికకును బహుమతులియ్యబడెను.

ఉపన్యాసములు.

ఈవత్సరమున 5 ఉపన్యాసము లిప్పించబడినవి.

విజ్ఞప్తి

గ్రంథాలయాభివృద్ధికి ధనము ముఖ్యావసరము. కనీసము ఒకలక్షరూప్యము లైనను కావలెను. సంఘమునకు, వచ్చుఆదాయమునకు మించిన వ్యయ మగుచున్నది. సంఘమునకు వలయు గ్రంథరాజములను కొనుటకు ధనము చేకూరుటలేదు. అందుచే విరాళములను ధారాళముగా ప్రసాదింతురని విశ్వసించుచున్నాము.

ఈ సంఘమున 1933 సంవత్సరాంతమునకు 365 సభ్యులు గలరు. 11,986 గ్రంథములు గలవు.

రు500/లనిచ్చిన శాశ్వతధర్మకర్తలు 33రును, అంతకంటె తక్కువ మొత్తము నిచ్చినవారు 42 రును కలరు. శాశ్వత ధర్మకర్తలు ఇచ్చిన సొమ్ముమీాద సాలుగు రు1,000/లు ఆదా వచ్చుచున్నది.

పత్రికలు:- ఆరు దినపత్రికలు, పండ్రెండు వారపత్రికలు పండ్రెండు మాసపత్రికలును వచ్చుచున్నవి.

రు 204-4-0 విలువగల 367 గ్రంథములు దాతలవలన ఇయ్యబడినవి.

ఆదా:- ఈవత్సరము ఆదా రు 5891-11-6 లు. వ్యయము రు 5882 లు.

17 వ ఆంధ్రదేశ గ్రంథాలయమహాసభ

24, 25 డిసెంబరు, 1934

17 వ ఆంధ్రదేశ గ్రంథాలయ మహాసభ డిసెంబరు నెల **24** వ తేదిన సాయంకాలము మద్రాసునగరమున కాంగ్రెసుమందిరమున సమావేశమయ్యెను.

అన్నామలై విశ్వవిద్యాలయమందు ఆర్థికశాస్త్ర పండితులగు డాక్టరు బి. వి. నారాయణస్వామిగారు ఈక్రింది ప్రారంభోపన్యాసమిచ్చిరి.

మన దేశమున ప్రజలవిద్యావిహీనత బ్రహ్మాండమగు సమస్యగ నున్నది. దీనిని నివారించుటకు నిరక్షరాస్యులను అక్షరాస్యులనుగ నొనర్పవలసియున్నది. అల్పవిద్యారంభకులగు ప్రజలు దానిని మరచిపోయి తిరిగి అవిద్యాంధకారమున బడిపోకుండ కాపాడవలసియున్నది. కాయకష్ట మొనర్చి జీవనోపాధిని సంపాదించు కొనవలసియున్న వ్యవసాయకులకును, ఇతర పాటకజనసామాన్యమునకును, పాఠశాలల కరిగి విద్యాభ్యాసమొనర్పగల శక్తిగాని, సావకాశముగాని లభ్యము కాదు. అట్టివారికి వినోదకరములును ఉత్సాహజనకములును అగు గ్రంథములు, గ్రంథపఠనమునందభిరుచిని గలిగించి విద్యోపార్జనాసక్తుల నొనర్పగలవు. విద్యాభ్యాసమునకు రాత్రిపాఠశాలలకుగాని, ఇతర ప్రయోజనవిద్యాశాలలకు గాని చనువారికవి మరింత ప్రోత్సాహకరముగ నుండగలవు. కొద్దికాలములోనే మన దేశమున గొప్ప రాజ్యాంగసంస్కరణలు ప్రారంభింపబడుచున్నవి. ఆసంస్కరణలు జయప్రదమగుటకు వోటరులు, వ్యవహారపరిస్థితులనెరిగి, దేశీయ సమస్యల బాగుగ దెలిసినవారై యుండవలెను. అప్పుడుగాని వారు, తమవోటింగు హక్కును వివేకముతో నుపయోగింపజాలరు. ప్రజలలో విద్యావ్యాప్తి కలుగుటవలన, పరిశ్రమలును, పరిశ్రమలయందలి కార్మికుల శక్తిసామర్థ్యములును అభివృద్ధి గాంచును. ఆ విధముగ గ్రంథాలయోద్యమము, దేశపారిశ్రామికాభివృద్ధికి గూడ చాల సాహాయ్యమొనర్చునదగును. విద్యావంతులగు ప్రజలు, తమ పౌరవిధులను పౌరధర్మములను, పారిశుద్ధ్యవిధులను బాగుగ గుర్తెరుంగగలరు. ఈ విధముగ ప్రజలు తమ రాజకీయ బాధ్యతల గూడ సరిగ నిర్వహించుకొనగలరు. ప్రపంచమునందలి నాగరక దేశములన్నిటియందును ప్రజలిపుడు, గ్రంథాలయోద్యమముయొక్క ప్రాముఖ్యమును బాగుగ గుర్తించియున్నారు. ఆంగ్లదేశమున నూరుసంవత్సరములకు పూర్వమే గ్రంథాలయోద్యమము ప్రారంభింపబడెను. అప్పటినుండియు ప్రభుత్వసాహాయ్యముతోడను, ప్రజల ఉత్సాహ కార్యదీక్షలవలనను గ్రంథాలయోద్యమ మా దేశమున బాగుగ వ్యాపించెను. గతశతాబ్దమందు రెండవయర్థభాగమున నార్వే, స్వీడన్, డెన్మార్కు, ఫ్రాన్సు, జర్మనీ దేశములు ప్రజోపయోగమునకుగాను గొప్ప గొప్ప గ్రంథాలయములను

స్థాపించెను. కాని స్కాట్లండు దేశమున నీయుద్యమ మందిన వ్యాప్తి చాల ఆశ్చర్యకరము. అచట ప్రతిగ్రామమునందును, బట్టణమందునుగూడ అనేక గ్రంథాలయములు గలవు.

"మన దేశమున అఖిలభారత గ్రంథాలయ సంఘమును స్థాపించుటలో మనవారు చాల దూరదృష్టిని గన్పరచిరి. ఇందువలన నిక నీ దేశమందన్ని ప్రాంతములలోని గ్రంథాలయములును ఏకముఖముగ నపనిచేయగలవు. ఈయుద్యమవిజయమునకు, ప్రజల యుత్సాహము కార్యదీక్ష, ధనికులఔదార్యము, ప్రభుత్వమువారి చట్టసహాయము అన్నియుగూడ అవసరము. ఈయుద్యమమును వ్యాపింపచేయు కార్యము, ఉత్సాహపరులును, సమర్థులును అగు యువకులకప్పగింపవలెను. గ్రంథాలయములను ప్రజాసామాన్య విద్యాసంస్థలుగ పరిగణించి వానిని నిర్వహించు భారమును స్థానికసంస్థలును, పురపాలక సంఘములును రాష్ట్రీయ ప్రభుత్వములును వహింపవలెను. మదరాసు పబ్లికు లైబ్రరీల చట్టమువంటి శాసననిర్మాణమందుకు చాలతోడ్పడగలదు. ఆ చట్టసహాయమున జిల్లా గ్రంథాలయసంఘములును, తాలూకా గ్రంథాలయ సంఘములును ఏర్పరుపబడును. ఒక్కొక తాలూకాయందలి ప్రాంతమునందలి గ్రామము లన్నిటియందును, స్థానిక గ్రంథాలయములుగాని సంచార గ్రంథాలయములుగాని ఏర్పరుచుటకును, ఉపన్యాసములను, ప్రదర్శనములను నేర్పరుచుటకును తాలూకా సంఘములును చాలవరకు కార్యభారము వహింపగలవు. చెన్నపట్నమువంటి పెద్దనగరములలో, ప్రతి డివిజనునకును అథమమొక్క గ్రంథాలయమైన నుండవలెను. ప్రజలచటకు వచ్చి వార్తాపత్రికల పఠించుటకును, స్వల్పమొత్తమును ధరావతుచేసి, గ్రంథముల నెరువుతీసుకొనివెళ్ళి చదువుకొనుటకును ఏర్పాటులు జరుగవలెను. ఈయుద్యమమున ఔదార్యవంతులెల్లరును చాల తోడ్పడగలరు. అమెరికా దేశమున కార్నెజీవంటి యుదారులీయుద్యమమున కొనర్చిన సాహాయము జగత్ప్రసిద్ధము. మన దేశమునగూడ ధనికుల ఔదార్యమీయుద్యమమునకు చేయూత యగునుగాక! విశ్వవిద్యాలయములుగూడ గ్రంథాలయనిర్వహణమునందు శిక్షణము నేర్పరచి, చాలవరకు తోడ్పడగలవు. మనరాష్ట్రమున ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ మీయుద్యమమున కమూల్యమగు సాహాయ్యమొనర్చుచున్నది. ఆసంఘము దినదిన ప్రవర్ధమానమై ఆంధ్ర దేశమున విజ్ఞానకాంతుల వెదజల్లుగాక."

రెండవదినము.

25 వ తేదీ మధ్యాహ్నమున తిరిగి సభ సమావేశ మయ్యెను. ఆహ్వానసంఘాధ్యక్షులగు శ్రీ దేశోద్ధారక నాగేశ్వరరావుపంతులుగారు ఈ క్రిందిరీతిని ఉపన్యాసమిచ్చిరి:—

ఆహ్వాన సంఘాధ్యక్షులగు దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి ఉపన్యాససారము.

కడచిన దినమందు అఖిలభారత గ్రంథాలయ మహాసభ జరిగియుండె ననియు, అందు ప్రసిద్ధులైనవార లనేకులు పాల్గొనియుండిరనియు, నాడు ఆంధ్ర గ్రంథాలయ మహాసభకు పల్లెటూరిప్రజ లనేకులు ప్రతినిధులుగా నరుదెంచి రనియు, 1885 సం॥ నుం

డియే మన దేశములో గ్రంథాలయోద్యమము ప్రారంభమైన దనియు, అస్వతంత్రమగు దేశమునందు ఇట్టియుద్యమములు కొనసాగుట కనేకములైన అంతరాయము లుండు ననియు, ఇట్టియుద్యమములు స్వప్రయత్నముపై గాని, లేక పరావలంబనమువలన గాని ఈ రెండుమార్గములలో నేదేని యొకదానివలన జరుగవలెననియు, మన పాలకుల యొక్క సాయమును మన మాశింతుమేని వారు నిర్ణయించువిధినిషేధముల కన్నిటికిని లోబడి వర్తింపవలెననియు వివిధరాష్ట్రములందును ప్రభుత్వమువారు వేర్వేరు శాసనములను కావించియున్నా రనియు, ప్రభుత్వసాహాయ్యమును బొందుచు, అట్టి శాసనముల నతిక్రమించినచో అసంస్థ అక్రమసంస్థ యగు ననియు, ఆంధ్రదేశములో ప్రభుత్వమువారి ఆదరణ లేకయే, ప్రజలు, యువకులును ఈ యుద్యమము నింతవరకు పోషించుచు, తమ వ్యక్తిత్వమును నిలువుకొనుచున్నా రనియు, గ్రంథాలయస్థాపనయనగా గొప్ప కట్టడములు, అద్దముల బీరువాలు, వేలకొలది పుస్తకములను సేకరించుటయేయని తలంపరాదనియు, ఉన్న గ్రంథములు కొలదియైనను అయ్యది ప్రజలవిద్యావ్యాప్తికి, విజ్ఞానోదయమునకు తోడ్పడునట్లుగా చూడవలెననియు, దేహమే దేవాలయము, జీవుడే దేవుడు, అజ్ఞానమే చీకటి యని పెద్దలు చెప్పి రనియు, కావున అజ్ఞానాంధకారమును పోద్రోలవలె ననియు, లక్ష్యము సమున్నతమైయుండుటవసర మనియు, ఆంధ్రదేశములో గ్రంథాలయోద్యమమున కవకాశమును, అభ్యుదయమును కల దనియు, ఐనను ఈ యుద్యమమును ఏకముఖముగా క్రమమైన పద్ధతులపై నడుపవలసిన భారము ఉద్యమ నిర్వాహకులపై కల దనియు రాజకీయములతో నీ యుద్యమమున కెట్టిసంబంధమును లేదనియు పల్కిరి. వివిధప్రాంతములనుండి సభ కరుదెంచిన ప్రతినిధులకు మనఃపూర్వక స్వాగతమును సమర్పించిరి.

దాసు త్రివిక్రమ రావుగారి అధ్యక్షోపన్యాసము.

పిమ్మట శ్రీదాసు త్రివిక్రమరావుగారు అధ్యక్షత వహింపవలెనని సి. వి. రంగం శెట్టిగారు, దశిక సుబ్బయ్యగారు గుబిలు సుందరేశనుగారు ఉపపాదించినపిమ్మట శ్రీ త్రివిక్రమరావుగారు ఈ క్రింది ఉపన్యాస మిచ్చిరి:—

గ్రంథాలయోద్యమమునకు సేవచేయుటయం దాసక్తుడనై యున్న నన్ను మీ రీ సభకు అధ్యక్షునిగా నియమించినందులకు నేను మిక్కిలి సంతసించుచున్నాను. ఈ ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ మేర్పడినపిమ్మట నీ 20 యేండ్లలోను ఆంధ్రదేశవాఙ్మయవిజ్ఞాన చరిత్రలో చాలముఖ్యవిషయములు జరిగినవి. గ్రంథాలయములద్వారా సమస్త ప్రజలలోను విజ్ఞానాభివృద్ధిని కలిగించుటకు యత్నింపబడెను. ఇది యెంతవరకు సఫలమైనదో చరిత్రకారులే వివరింప నర్హులు.

తెలుగుభాషను మాట్లాడునట్టి రెండుకోట్లమంది ప్రజలలోను 1920 నుండి 100 కి 100 వంతున చదువుకొనినవారిసంఖ్య అధికమగుటయేగాక దేశాభివృద్ధికి సహాయకములగు నన్ని ఉద్యమములతోను ప్రజలకు సంబంధము

గూడ చాల అధికమైనది. ఆంధ్రభాష
లో చాల పత్రికలు బయలు దేరినవి. చవుక
రకము గ్రంథములు చాల వెలువడినవి.
ముద్రాశాలలు చాల హెచ్చినవి. స్త్రీలును
పురుషులునుగూడ గ్రంథములను మిక్కిలి
హెచ్చుగా చదువుచున్నారు. ప్రజలలో
విజ్ఞానప్రబోధము సాంఘిక రాజకీయ, మత,
సారస్వతాది సకల విషయములలో గూడ
స్థిరముగా నేర్పడినది.

భారతజాతీయత ప్రబలతమము. దానివిక
సన మన్ని విధములుగా గోచరించుచున్నది.
ఈజాతీయోద్యమమున కనుబంధమగు గ్రం
థాలయోద్యమాభివృద్ధికి కొందరు ఆంధ్ర
దేశమున తమ జీవితములను వినియోగించు
చున్నారు. ఇటీవల ప్రారంభింపబడిన సంఘ
సంస్కరణోద్యమము లన్నిటిలోను నిది
ప్రబలతమము. వీరు దీనికి ప్రారంభకులు.
శ్రీయుతులు సూరి నరసింహశాస్త్రి,
అయ్యంకి వేంకటరమణయ్య, వావిలాల
గోపాలకృష్ణయ్య, వి. వి. శ్రేష్ఠి, నాళం
కృష్ణారావుగార్లు మున్నగువారు పెక్కుమంది
గ్రంథాలయోద్యమాభివృద్ధి కత్యధికముగా
కృషిసలుపుచున్నారు.

ఈ యుద్యమము బాగుగా కొనసాగినచో
మన దేశమునందలి కోట్లకొలది ప్రజలస్థితి
చాల అభివృద్ధి నొందును. కాన నిది ముఖ్య
మగు ప్రజాసేవయే యగును. ఐరోపా మహా
సంగ్రామము ముగిసిన పిమ్మట కొంత కాలము
వరకు ప్రపంచమున శాంతి కలుగకపోవుటచే
ప్రపంచమునం దంతటను విజ్ఞాన, రాజ
కీయ, ఆర్థికాదివిషయములను గూర్చి ప్రబల
తమమగు నాందోళనము తల సూపినది.
వివిధదేశములవారు కలిసి ఆలోచించి పని
చేయుటకు అవసరమగు సమత్వమును కలిగిం
చుటకు చాలమంది నిరంతరాయముగా పని
చేయుచున్నారు. ఒకరి నొకరు చంపుటకు
మాత్రమేగాక నూతనవిధమగు స్వాతంత్ర్య
ము బడయుటకుగూడ వివిధజాతులవారు తపిం
చుచున్నారు. ఈనాటకమునందు మనముగూ
డ చాలఆసక్తిని కలిగియున్నాము. ఏలననగా
మన భావిచరిత్రకు మార్గదర్శక మగునని
పవిత్రభావమును మనము కాపాడుకొనగోరు
చున్నాము. భావికాలమున ధర్మసమ్మతమగు
సాంఘికవిధాన మేర్పడ గలదని తలంచు
చున్నాము. దానిలో మన సాంఘిక ఆశయ
ములును, ఆధ్యాత్మికరత్నములును చేర్ప
బడగలవు. అట్టి విఖ్యాతమగు నాగరకత
యొక్క లాభమును మనముగూడ పూర్తిగా
బడయ గోరుచున్నాము. కాని అతినీచ
ములు, హానికరములు అగు సాంఘికదురా
చారములను ముందుగా మనము తొలగింప
వలసియున్నది. ఈ విషయమున గ్రంథాల
యోద్యమము చాల పనిచేయవలెను. సత్య
నిరతులై వివేకముతో పనిచేయుచు ధర్మనిర
తులగు పౌరులుగా నుండి మానవసేవ చేయ
గల్గునట్టి స్త్రీలును, పురుషులును చాలమంది
ఏర్పడుటకు తగినవిధానమును ఈ ఉద్య
మనాయకులు సిద్ధపఱుపవలెను. సంఘము
నకు మేలు కలుగు నిమిత్తము వ్యక్తులు
స్వార్థత్యాగ మొనరించుట ముఖ్య సిద్ధాం
తము. అటుపైని సంఘమునందు అన్ని తె
గలవారికిని సరియైన న్యాయము జరుగ
వలెను. ఇపు డున్న అగ్ర అంత్య విభేదము
లంతరించవలెను. ప్రస్తుతము మన దేశమున
సాంఘికసమస్య క్లిష్టరూపమును దాల్చినది.

సంఘసంస్కరణము చేయవలెనని విద్యావిధానములో గూడ మార్పులు జరుగవలెను. జాతీయబాధ్యతలను గుర్తించిన దేశములవారు అతిశీఘ్రముగానే సంఘస్థితిని సవరింపగల్గుదురు. రషియా దేశమున సంఘసంస్కరణముతో పాటు విద్యాసంస్కరణము గూడ జరిగినది. అటులనే ఇటలీ, జర్మనీ దేశములలో గూడ విద్యావిధానమున చాల మార్పులు జరిగినవి. దేశమునసున్న ప్రజలకందరికి సమాన అవకాశ మొసంగుటే నవీన సాంఘిక ఆశయము. ఇందులకు ప్రజలందరు పనిచేయవలెను. మానవసంబంధములు మారవలయును. "ఇటుపైని ప్రపంచము నివాసయోగ్యముగా నుండునట్లు విద్యావిధానము విద్యార్థులకు బోధించుట ముఖ్యతమము". అని కొలంబియా విశ్వవిద్యాలయమునందలి డీన్ రసెల్ గారు నుడివిరి. ప్రజలకందరికిని జ్ఞానమును కలుగజేయుటే గ్రంథాలయమున ముఖ్యకర్తవ్యము. ప్రజలలో నూతన జాతీయ జీవన, విజ్ఞానము నాగరకత మున్నగునని వృద్ధినొందవలెను. ఇప్పుడు మనకు అనుభవము గలదు. ప్రజలతో కలసి మెలసి తిరుగుటకు అవకాశములు గలవు. జ్ఞానమును బడయుటకును, సంఘసేవ చేయుటకును చాల అవకాశములు లభించునుగాన మనము సంఘపునర్నిర్మాణమును చేయగల్గుదు మను గట్టినమ్మకముతో పనిని ప్రారంభింపవలెను.

గ్రంథాలయములకు పుస్తకములు, పత్రికలు చేర్చినంతమాత్రమున వెంటనే మనము కోరిన ఫలితము కలుగదు. మనుష్యులకు సహజమగు విజ్ఞానసంపదను వారు తెలిసికొనగల్గుటకు తగు విధానమును మనము బాగుగా యోచించి నిర్ణయింపవలెను. అందులకు గ్రంథాలయములవారు చేయవలసిన పనుల వ్యాప్తి అధికము కావలెను. ప్రజలకు గ్రంథాలయములయొద్ద పుస్తకముల నిచ్చుటయేగాక వీలున్నంతవరకు ప్రజలలో సద్వర్తనము కలుగజేయుట ఇప్పుడు ముఖ్యావసరమై యున్నది. ఇందులకు గ్రంథాలయముల సంఖ్య చాల అధికము కావలెను. గ్రంథములు, ఉపన్యాసములు, మాజిక్ లాంతరులు మున్నగు వాటివలన ప్రజలలో జ్ఞానమును అత్యధికముగా వ్యాపింపజేయవలెను. ఆంధ్రదేశమునందున్న 12 జిల్లాలలోను ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయముల నేర్పరచి, ఆరీతిగా వాటిని ఉపయోగించుకొనవలెను. 12 జిల్లాలలో 10,000 ప్రాథమిక పాఠశాల లున్నవి గావున 10,000 గ్రంథాలయముల నేర్పాటు చేయవచ్చును. పాఠశాలల ఉపాధ్యాయులు గ్రంథాలయోద్యమములు సరిగా నిర్వహింప గల్గుటకు వారికి తగిన అభ్యాసమును కలుగజేయవలెను. ఈ గ్రంథాలయముల పరిపాలన బాధ్యతను జిల్లా బోర్డులకే వశపఱుపదగును. ఇటుల గ్రంథాలయ వ్యాప్తికి ప్రాథమిక పాఠశాలలను పునాదులుగా చేసుకొని క్రమక్రమముగా దాని నభివృద్ధి నొందింపవలెను. సంఘసేవకు సంబంధించిన ఉద్యమములకు కావలసిన ధనమును సమకూర్చుటకు వ్యక్తులపై ఆధారపడగూడదు. ప్రభుత్వము వారుపన్నులనువసూలు చేయుచున్నారు. కావునవిద్యావిషయమునను శారీరకవిషయమునను వారు ఎక్కువ సేవ చేయవలసియున్నది. పాఠశాలలో చదువతగిన వయస్సుగల వారికిమాత్రమేగాక పెద్దవారికిని, మిక్కిలి చిన్నవయస్సు వారికినిగూడ జ్ఞానము

ను కలుగజేయుట విద్యాశాఖవారికర్తవ్యమై యున్నది. ప్రస్తుతము దొరతనమువారిటుల చేయుటలేదు. కావున ఆంధ్రదేశముయొక్క ఆవశ్యకమునుబట్టిగ్రంథాలయములను పోషించుటకు కావలసినంత ధనమును దొరతనము వారిచ్చునట్లు గ్రంథాలయోద్యమము వారును శాసనసభ్యులును, సంఘ సంస్కర్తలుగూడ దొరతనమువారిని నిర్బంధింపవలెను. ఇప్పుడు చెన్నరాష్ట్రము మొత్తముమీద కొన్ని వేలు మాత్రమే యిచ్చుచున్నారు. కొన్ని లక్షలు కావలెను. వారటులుచేయువరకును ఎక్కువ పట్టుదలతో దేశసేవకు నిర్భయముగా తీవ్రముగు ఆందోళన జరుపుచునే యుండవలెను. శాసనసభ్యులు గ్రంథాలయ ఉద్దేశములను అవకాశములను తెలిసికొనవతర్వాతనే తగిన చిత్తుచట్టములను సిద్ధపఱుపవలెను. విదేశములలో చేయబడుచున్న చట్టములను అంధప్రాయముగా అనుసరించుటవలన మనకెట్టి లాభము కలుగదు. ప్రభుత్వమువారు ధనమొసంగనియెడల చట్టముచేయుటవలన ప్రయోజనము లేదు. కొన్ని సం॥లలో గ్రామమునకు కనీసమొక గ్రంథాలయమైన నేర్పడునటుల ప్రజానాయకులను ప్రభుత్వమును ప్రోత్సాహపఱచు నిమిత్తము ఉద్యమమున పనిచేయు నాయకులు దీక్షగా పనిచేసెదరా? ఇది అసాధ్యమని మన నాయకులు తోసి పుచ్చెదరేమో. వారటుల చేసినచో ప్రజల లాభమును తృణీకరించినవారే యగుదురు. పౌరధర్మములను సరిగా ప్రజలందరు నెరవేర్పవలెననినను దేశమునకు కావలసిన విషయములను బలపఱుపవలెననినను ప్రజలు విజ్ఞానవంతులుగా నుండవలెను. లేనిచో జాతీయ పునర్నిర్మాణము కొనసాగదు. కావున అందులకు కావలసినచట్టములు చేయబడుట, గ్రామములలోనున్న ప్రాథమికపాఠశాలలు గ్రంథాలయములుగా చేయబడుట, గ్రంథాలయముల నిమిత్తము కావలసిన ధనమును దొరతనమువారొసంగుట, మన దేశమునందలి స్త్రీలను పురుషులను గ్రంథాలయోద్యమమునందు తమబాధ్యతను గుర్తించి ఎక్కువశ్రద్ధతో పనిచేయుట మున్నగు విషయములనుగూర్చి మనమిపుడు దీక్షగా పనిచేయవలెను. దొరతనమువారు తమవిధులను నిర్వర్తించువరకు మనముమిన్నకుండవలెననినాఉద్దేశముకాదు. ఈలోగా మనము చేయువలసినపని హెచ్చుగా నున్నది. ఇప్పుడు మండల సంఘములు, తాలూకాసంఘములు, చాల చోట్ల నున్నవి. కొన్నిచోట్ల పనిచేయుచున్నవి. మరికొన్ని చోట్ల పనిచేయుటలేదు. కొన్ని మండలములలో వందలకొలది గ్రంథాలయములున్నవి. మరికొన్నిటిలో చాల తక్కువగా నున్నవి. కొన్నిటికి ధనమెక్కువగానున్నది. మరికొన్ని నిరాధారస్థితియందున్నవి. అనుభవజ్ఞులును, నిపుణులగువారు కొన్నింటిని పరిపాలించుచున్నారు. కాని అధిక సంఖ్యాకములగు సంఘముల పరిపాలన సరిగా జరుగుట లేదు. కావున అభ్యాసమును బడసిన గ్రంథాలయాధికారులను నియమింపవలసియున్నది రాష్ట్రీయ సంఘమువారి సూచనల ప్రకారము రాష్ట్రములోని సంఘము లన్నియు సహకార సామరస్య భావములతో కలిసి పనిచేసిననే గాని సరియైన ఫలితము కలుగదు. కావున ఒక సం॥ పాటు చేయువలసిన పనిని మన మిపుడు నిర్ణయించి దానిని దీక్షగా నిర్వహింపవలెను. అప్పుడప్పుడు గ్రంథాలయములను పరీక్షించుచుండవలెను. నాయకు

లతో ఉత్తరప్రత్యుత్తరములను జరుపవలెను. తరుచుగా మండల తాలూకాగ్రంథాలయ సభలను జరుపుచుండవలెను. అటుల చేసినచో ఉద్యమము సరిగా నుండును. ఇందులకు నిపుణులు కావలెను. వారు తమ ప్రాంతములలో సమగ్రాభివృద్ధికొఱకు పనిచేయవలెను. కావున గ్రామపునర్నిర్మాణముగూడ గ్రంథాలయోద్యమమున ఒకభాగముగ నుండవలెను. అమెరికావారీ పద్ధతిని అనుసరించుటవలన మంచిఫలితముకలిగినది. కావున మనదేశములో గూడ ప్రతిగ్రామమువారు తమ ప్రాంతములలో సరిగా పనిచేయునెడల మన ఆశయము మీడేరగలదు. ప్రజాప్రభుత్వాశయములను వృద్ధినొందించుటయును లాభకరములగు పనులను చేయించుటయును గ్రంథాలయ సంఘములవారి సేవకు ముఖ్యలక్షణములు. మానవ సంఘాభివృద్ధికి సంబంధించిన తక్కిన అన్ని ఉద్యమములతో కలసి గ్రంథాలయములవారు గూడ ఉదారభావముతో సాంఘికాభివృద్ధికి పనిచేయవలెను. ప్రజలలో విద్యయును, పాండిత్యమును, వినోదమును కలుగజేయవలెను. ఇందులకు ప్రజలు ప్రభుత్వముగూడ ఉద్యమమునకు తోడ్పడవలెను. ఇది జాతి కంతకును అధికముగు లాభమును కలుగజేయునట్టిది. కాని వ్యక్తిలాభమును కలుగజేయునది కాదు. జాతివిజ్ఞానము, ప్రజల సద్వర్తనము, సుఖజీవనము వీనిని బట్టియే జాతిఆధిక్యత యేర్పడును. ప్రాచీనులగు ఆంధ్రులు జ్ఞాన విజ్ఞాన సంపన్నులై యుండి మనకు విజ్ఞాన మొసంగినను ఇప్పుడు ఆంధ్రులు దానిని సరిగా వినియోగించుకొన లేదను నపఖ్యాతికి మనము పాల్పడ కూడదు. అనంతరము ఈదిగువ తీర్మానములు చేయడినవి

తీర్మానములు.

౧. ఆంధ్రగ్రంథాలయసభను ముందు సంవత్సరము చిత్తూరునకు ఆహ్వానించుచున్నారు.

ఉ: సి. వి. రంగంశ్రేష్ఠిగారు

అ: యస్. యస్. రాజగోపాల్

౨. ఆంధ్రదేశ గ్రంథాలయసంఘమును ఆంధ్రదేశమునందలి గ్రంథాలయములకు ప్రాతినిధ్య సంస్థచేసి గ్రంథాలయోద్యమమును దేశమునం దంతటను వ్యాపింపచేయు కార్యనిర్వాహకవర్గము నొకదాని నేర్పరుపవలెనని యీ సభవారు తీర్మానించుచున్నారు.

ఉ: యం. రామారావుగారు

అ: నరహరిశెట్టి ఆంజనేయులుగారు

3. ఆంధ్రదేశముననున్న గ్రంథాలయములయొక్క పట్టికను త్వరలో ప్రకటించుట మిక్కిలి అవసరముగాన ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమువారీ కార్యమును త్వరలో నెరవేర్పవలెనని యీసభవారు తీర్మానించుచున్నారు.

ఉ: వావిలాల గోపాలకృష్ణయ్యగారు

అ: పుణ్యమూర్తుల రాజశేఖరంగారు

౪. ఆంధ్రదేశమున జిల్లా తాలూకా గ్రంథాలయసంఘము నెలకొల్పుటకై యువ

సంఘము నొకదానిని ఏర్పరచుటకు ఈ సభ వారు తీర్మానించుచున్నారు.

ఉ: యం. రామారావుగారు

ఆ: నరహరిశెట్టి రంగారావుగారు

౫. కీ॥ శే॥ ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి జీవితచరిత్ర రచించిన గుమ్మడిదల సుబ్బారావుగారిని, శ్రీవారి గ్రంథము లన్నియు ప్రచురించిన ఆంధ్రవిద్యాపీఠగోష్ఠి వారిని ఈ సభవారు అభినందించుచు శ్రీవారి గ్రంథరాజములను ఆంధ్రదేశములో నున్న వివిధ గ్రంథాలయములవారు వారి గ్రంథాలయములందు ఉంచుట అవసరమని ఈసభవారు అభిప్రాయపడుచున్నారు.

ఉ: నుసర్ల బ్రహ్మదేవరశాస్త్రిగారు

ఆ: మల్లెల శ్రీరామమూర్తిగారు
బెజవాడ.

౬. ఇటుపై జరుగు సంవత్సరసభలలో జరిగిన సంవత్సరముల యొక్క కార్యక్రమమును ఆదాయవ్యయ పట్టికను ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమువారు తప్పక ప్రకటించుచుండవలెనని యీ సభవారు కోరుచున్నారు.

ఉ: పాతూరి నాగభూషణంగారు

ఆ: అయ్యంకి వెంకటరమణయ్యగారు

౭. పంచాయతీ బోర్డులచే నిర్వహింపబడు గ్రంథాలయములకు గాని లేక బోర్డుపేరున గాని పంచాయతీ ఫండునుండి పత్రికలు వగైరాలు ప్రభుత్వపు టనుమతి లేనిదే తెప్పించరాదని గావించిన సర్క్యులరువల్ల గ్రామ ప్రజలవయోజనవిజ్ఞానాభివృద్ధికి భంగకరము గావున సదరు సర్క్యులరును రద్దుపరచవలసినదిగా ప్రభుత్వము వారి నీ సభవారు కోరుచున్నారు.

అధ్యక్షులు.

౮. మనరాజధానియందు నానాభాషలలో ప్రచురింపబడు గ్రంథములపట్టిక దొరతనమువారు ఫోర్టుసెంటు జార్జి గెజెటులో మూడు నెలలకొకసారి ప్రచురించుటవలన ప్రజాబాహుళ్యమునకు లేశమును లాభము కానందున జిల్లా గెజిటులో కూడ ప్రచురింపచేయునటుల ఈసభవారు దొరతనమువారికి తెలియపరచుచున్నారు.

ఉ: న. ఆంజనేయులుగారు

ఆ: అ. వెంకటరమణయ్యగారు

౯. చెన్నపురిలోనున్న కనిమిరా లైబ్రరీ వారివలెనే మన ఆంధ్రవిశ్వవిద్యాలయాధికారులును ఆంధ్రరాష్ట్రగ్రంథాలయములనన్నిటిని తమకు జేరికగా చేసికొని ఆయా గ్రంథాలయములకు వలయు గ్రంథములను బదులుగా నిచ్చి పుచ్చుకొనుటలు జరుపుటకై తమసమ్మతిని తెలుపగలందులకు ఈసభవారు కోరుచున్నారు.

అధ్యక్షులు.

౧౦. ఇదివరలో మద్రాసుప్రభుత్వమువారు పంచాయతీబోర్డులకొసంగుచుండెడిగ్రాంటును ప్రస్తుతము నిలుపుదలచేయుట గ్రామప్రజలవిజ్ఞానాభివృద్ధికి భంగకరము గావున వెంటనే మరల రాబోవు 1935-36సం॥ బడ్జెటు నుండియు పంచాయతీబోర్డులచే నిర్వహింపబడినగ్రంథాలయములకు గ్రాంటు నేర్పాటు చేయగలందులకు మద్రాసుప్రభుత్వమువారి నీసభవారు కోరుచున్నారు.

అధ్యక్షులు

౧౧. 1860 సం॥ నెం 21 రు చట్టప్రకారము రిజిష్టరుచేయుట కివ్వవలసిన రుసుమును గ్రంథాలయములకును పఠనమందిరములకును లేకుండ ఉచితముగా రిజిష్టరీచేయించునటుల చట్టమును సవరించివేయవలెనని ప్రభుత్వము వారిని ఈసభవారు కోరుచున్నారు.

అధ్యక్షులు

౧౨. ప్రభుత్వమువారు ప్రావిన్షియలు ఫండునుండి వివిధగ్రంథాలయముల కొసంగు గ్రాంటుసందర్భములో గ్రంథాలయములు రిజిష్టరు చేయుబడవలయునను నిర్బంధమును తొలగించవలసినదిగా ప్రభుత్వమువారి నీ సభవారు కోరుచున్నారు.

అధ్యక్షులు.

౧౩. ముద్రాలయములలో ముద్రింపబడు గ్రంథములలో మూడేసిప్రతుల చొప్పున గైకొనుచు వానిని తమకు తోచినరీతిని పంపుచున్న దొరతనమువారిని నాల్గవప్రతికూడ గైకొనుచు నయ్యది ఆంధ్రుల కుపయోగపడునట్లు ఆంధ్ర విశ్వవిద్యాలయ గ్రంథాలయమునకో ఆంధ్రసాహిత్య పరిషద్గ్రంథాలయమునకో పంపుచుండగలందులకు తగిన శాసనముల నిర్మించుటకై విద్యాశాఖకు సంబంధించిన శాసనసభ్యులను ఈ సభవారు కోరుచున్నారు.

అధ్యక్షులు.

౧౪. ఆంధ్రభాండారి తరిబీదు శిక్షణతరగతులను వెంటనే ప్రారంభించుట అవసరమని ఈ సభవారు ఆంధ్రవిశ్వ కళాపరిషత్తువారిని కోరుచున్నారు.

అధ్యక్షులు.

౧౫. ప్రభుత్వవిరాళములకై గ్రంథాలయములనుండి రాబడుదరఖాస్తులు అట్టి గ్రంథాలయము లుండు ప్రదేశమునకు గల మునిసిపాలిటీ లేక జిల్లాబోర్డుల ద్వారానే పంపబడవలయునను నియమమును తొలగించవలయునని ఈ సభవారు మదాసుప్రభుత్వము వారిని కోరుచున్నారు.

౧౬. గ్రంథాలయముల పోషణకొరకు Assessed waste lands శిస్తుకట్టుగయారు భూములను గ్రంథాలయములకు శాంక్షన్ చేయుటకొరకు జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వు లిప్పించవలసినదిగా ఈసభవారు ప్రభుత్వము వారిస కోరుచున్నారు.

ఉ: దశిక సుబ్బయ్యగారు

ఆ: ఏలూరుపాటి రామభద్ర చయనులుగారు

౧౭. ఎ. ఆంధ్రరాష్ట్రములోని ముఖ్యప్రాంతములగు జయపురం, పర్లాకిమిడి, బరంపురం మొదలగు ముఖ్యాంధ్రప్రదేశమును నూతన ఒరిస్సా రాష్ట్రములో చేర్చుచు ఆంధ్రాభ్యుదయమునకు ఆంధ్రవిజ్ఞానాభివృద్ధికి తీరని నష్టము కలిగించిన జాయింటు పార్లమెంటరీ కమిటీవారి సలహాను తీవ్రముగా ఖండించుచు అట్టిసలహాను ఉపసంహరించుకొను నటుల ఆంధ్రులెల్లరును ప్రచండాందోళన జరుపవలెనని ఈ సభవారు ఆంధ్రదేశీయులను కోరుచున్నారు.

బి. ప్రత్యేకాంధ్రరాష్ట్ర మవసరమని యీ సభవారభిప్రాయపడుచు రాష్ట్రనిర్మాణమునకై తగువిధముల పాటుపడవలెనని దేశీయులెల్లరను నీ సభవారు గోరుచున్నారు.

ఉ: వావిలాల గోపాలకృష్ణయ్య గారు

ఆ: మల్లెల శ్రీరామమూర్తి గారు

ఫలహారము.

సభానంతరము ఆనరబిల్ దివాను బహద్దరు గోపతి నారాయణస్వామిగారు ప్రతినిధులకు విందును గావించిరి.

రాబోవు సభ.

రాబోవుసభను చిత్తూరుజిల్లా నారాయణవరం హనుమద్గ్రంథాలయ కార్యదర్శియగు సి. వి. రంగం శ్రేష్ఠిగారు తమగ్రామమున జరుగుటకై ఆహ్వానించిరి.

అంతటితో సభ ముగిసినది.

బాలగంగాధరతిలక్ పుస్తకాలయము, పెదపులివర్రు,

రేపల్లె తాలూకా.

ఈ గ్రంథాలయముయొక్క త్రయోదశ వార్షికోత్సవము 14-11-34 తేదీనాడు శ్రీ చెరుకువాడ వేంకటనరసింహంగారి అధ్యక్షతక్రింద జరిగినది. అప్పుడు నివేదింపబడిన ఈ సంగతులను ప్రచురించుచున్నాము.

ఇది పదమూడు సంవత్సరములక్రిత మీ గ్రామమందు స్థాపింపబడినది. రూ. 130 లు విలువగల గ్రంథములను, రూ. 20 లు చేయు బీరువాను బ్రహ్మశ్రీ పండిత కాశీనాథుని రాజలింగశాస్త్రిగా రిచ్చిరి.

గ్రంథాలయోద్యమముయొక్క ప్రాశస్త్యమును గమనించి లోకోపకారమొనర్ప స్థితప్రజ్ఞులై కొవ్వూరునందుగల ఆంధ్రగీర్వాణ విద్యాపీఠమునకు రూ. 12,000/-లు విరాళమొసగి వారు రచించిన గ్రంథములను మన గ్రంథాలయమునకు సహితము పంపుచు అభిమానమును వెల్లడించు మహానుభావులు శ్రీ "వల్లూరి సూర్యనారాయణరావు పంతులుగారును" పూజనీయులు.

సం॥రములో 18 బాలకవర్గసమావేశములను, 1 సన్మానసంఘసమావేశమును జరిపి, 38 హంశములపై చర్చించి తీరుమానించినారు.

స్త్రీ విద్యావ్యాప్తికిగాను ప్రత్యేకసౌకరును నియమించి, నియమానుసారము పుస్తకముల నిండ్లకందించి స్త్రీలయందు విజ్ఞానమును వృద్ధిచేయుచున్నారు.

1400 లకు పైగా గ్రంథములు 5 బీరువాలు కలిగి 10 పత్రికలు తెప్పించుచు పాఠకులు దినదినాభివృద్ధి యగుచున్నారు.

ఈ గ్రంథాలయమునకు 10 పత్రికలు వచ్చుచున్నవి. ఈ సంవత్సరము దాతలు 389 గ్రంథములను దయతో నొసంగిరి.

ఈ గ్రంథాలయమునకు 1921 సం॥ జూలైలో కాలువ లంకలపాటలకు గ్రామములో నున్న భిన్నభావములను బహు ఓర్పుతో నేకీభవింపజేసి ఆ పాటలమీద వచ్చిన ఆదాయమును ఖర్చులతో రు 966-0-0 వసూలు వరచి అప్పుడు ఉన్న జాతీయవిద్యాలయమునకు గ్రంథాలయమునకు జాయింటుగానున్న ఖాతాకు శ్రీ కనగాల కృష్ణయ్యచౌదరిగారు ఇప్పించిరి. 1934 సం॥రమునకు రు 100 లు మొత్తము రు 200-0-0 లు వడ్డీతోసహా.

ది 3-10-34 భట్టిప్రోలువసూలు(దసరాభిక్షలు)

శ్రీయుత	రు	అ
భట్టిప్రోలు చంద్రశేఖరరావుగారు	0	8
మద్దుల గిరిరావుగారు	1	0
పాలకుర్తి సీతారామయ్యగారు	0	8
మద్దుల నరసింహంగారు	0	8

ఆంధ్రదేశ గ్రంథాలయసంఘము, బెజవాడ

వార్షికసభ

ఈతేదీ (25-12-34) సాయంత్రం 6 గంటలకు 17-వ ఆంధ్రదేశ గ్రంథాలయ మహాసభ సమాప్తిఅయినపిమ్మట ఈ సంఘముయొక్క వార్షిక సామాన్యసంఘసభ్యులసభ శ్రీ దాసు త్రివిక్రమరావుగారి అధ్యక్షతక్రింద సమావేశమై నూతన సంవత్సరమునకు (1935) ఈ క్రిందవివరించిన ప్రకారము ఎన్నికలు జరిపెను.

అధ్యక్షులు—దాసు త్రివిక్రమరావుగారు,

ఉపాధ్యక్షులు—

రావుసాహేబ్ యం. అప్పారావుగారు, భూపతిరాజు సీతారామరాజుగారు, దుగ్గిరాల సూర్యప్రకాశరావుగారు, భూపతిరాజు తిరుపతిరాజుగారు, శ్రీరాజా యార్లగడ్డ శివరామప్రసాద బహద్దరు జమీందారుగారు, ఊటుకూరి వెంకటసుబ్బరాయశ్రేష్ఠిగారు, బొడ్డపాటి సీతాబాయమ్మగారు, గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు, బెజవాడ రామచంద్రారెడ్డిగారు, సి. ఆర్. పార్థసారథి అయ్యంగారు, వామన్ నాయక్ గారు, కె. రంగనాథం మొదలియారుగారు, పామి వెంకటాచలం శ్రేష్ఠిగారు, అట్లూరి వెంకటసీతమ్మగారు, కాశీనాథుని నాగేశ్వరరావుగారు, గోపు రామచంద్రరావుగారు, ముంతెన పుల్లంరాజుగారు.

కార్యదర్శి—అయ్యంకి వేంకటరమణయ్యగారు,

సహాయకార్యదర్శులు—

మల్లెల శ్రీరామమూర్తిగారు, ముద్దుకృష్ణగారు, తిత్తి బలరామయ్యగారు, మారేపల్లి రామచంద్రశాస్త్రి కవిగారు, పుణ్యమూర్తుల రాజశేఖరంగారు, నేత్రకంటి యోగానందరావుగారు, సుసర్ల బ్రహ్మదేవరశాస్త్రిగారు, వేముగంటి పాపాయమ్మగారు, బులుసు వెంకటసుబ్బారావుగారు, కొండ సచ్చిదానందరాజుగారు, కైప సుబ్రహ్మణ్యశర్మగారు, మాదపాటి హనుమంతరావుగారు, పప్పూరి రామాచార్యులుగారు, సి. వి. రంగం శ్రేష్ఠిగారు, చట్టి నరసింహారావుగారు, హావిలాల గోపాలకృష్ణయ్యగారు.

కార్యనిర్వాహకవర్గము—గంజాంజిల్లా.

పుల్లెల శ్యామసుందరరావుగారు
జగన్నాథపాణి ఖడంగగారు
పాట్నూరి స్వామిబాబుగారు

విశాఖపట్నం—పురిపండా అప్పలస్వామిగారు
తెన్నేటి విశ్వనాథంగారు
బుర్రా శేషగిరిరావుగారు

తూర్పుగోదావరి—నరసింహదేవర సత్యనారాయణగారు
కందుకూరి రామభద్రరావుగారు
నాళం కృష్ణరావుగారు

పశ్చిమగోదావరి—నరహరిశెట్టి ఆంజనేయులుగారు
వేగేసిన సూరపరాజుగారు—పాండువ్వ
కలిదిండి గంగరాజుగారు
పోతాప్రగడ శ్రీ రామారావుగారు

కృష్ణా—కామినేని వెంకటప్పయ్యగారు
రేపాల బుచ్చిరామశేషయ్యగారు
పురాణం సూరిశాస్త్రిగారు
గుత్తా వీరయ్యగారు

గుంటూరు—పాతూరి నాగభూషణంగారు
కస్తూరి కుటుంబరావుగారు
నడింపల్లి లక్ష్మీనరసింహారావుగారు

కర్నూలు—రాజా పెద్దసుబ్బరాయుడుగారు
దేశపాండ్య సుబ్బారావుగారు
శేషూరి యల్లమందయ్యశ్రేష్ఠిగారు

అనంతపురం—హట్టి శంకరరావుగారు
కాండూరి వెంకటసుబ్బయ్యగారు—హిందూపురం
కల్లూరి సుబ్బారావుగారు

కడప—టి. రామకృష్ణయ్యగారు
యస్. కృష్ణస్వామిగారు

బళ్ళారి—టి. రాఘవాచారిగారు

చిత్తూరు—టేకూరి సుబ్రహ్మణ్యంగారు
బూదూరు రామానుజులురెడ్డిగారు
యం. శ్రీనివాసాచార్లుగారు

నెల్లూరు—గండవరపు హనుమారెడ్డిగారు
బొమ్మా శేషురెడ్డిగారు
తూములూరు శివరామయ్యగారు

మద్రాసు—కస్తూరి లక్ష్మీనరసింహారావుగారు
ఆర్. జనార్దనరావునాయుడుగారు

రాజపోషకులు—ముంతెన పుల్లంరాజుగారు-పాండువ్వ

ధర్మవరముతాలూకా ద్వితీయగ్రంథాలయ సమావేశము.

15-12-34 తేదీ శనివారమునాడు నాగసముద్రమునందు ధర్మవరము బోర్డు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులగు శ్రీయుత పర్వతరాజు సూర్యనారాయణరావు, B. A., L. T గారి యాజమాన్యమున జరిగిన పై సమావేశమునందు కావింపబడిన

తీర్మానములు.

(1) గ్రామపంచాయతీ గ్రంథాలయాభివృద్ధికై, ఇదివరలో నొసంగుచుండిన మేరకే విరివిగా విరాళముల నొసగుటకై తగిన యేర్పాట్లు గావించునట్లు ప్రభుత్వమువారిని ప్రార్థించునదిగా తీర్మానించుటయైనది.

(2) గ్రంథాలయములనురిజస్టరుచేయించుటకై 1860 సంవత్సరము XXI ఇండియా ఆక్టులో విధింపబడియుండు రూ 50/ రుసుమును తగ్గించుటకై తగిన సవరణల నుపపాదించునదిగా భారతశాసనసభకు మనరాయలసీమ ప్రతినిధిగా నెన్నుకొనబడియుండు శ్రీమాన్ మాడభూషి అనంతశయనం అయ్యంగారిని కోరునదిగా తీర్మానించుటయైనది.

(3) ప్రతిగ్రామపంచాయతీబోర్డువారును తమస్వాధీనమున నుండు గ్రంథాలయమునకు తమ గ్రామపాఠశాలలో పాటుపడుచుండు ఉపాధ్యాయమహాశయుని గ్రంథాలయభాండాగారికునిగా ఉపయోగించుకొనుట చాలా శ్రేయస్కరమని ఈసభవారు సూచించుచున్నారు.

(4) ధర్మవరముతాలూకా గ్రంథాలయ సంఘమువారు గ్రామసీములందు విజ్ఞానవ్యాపనమునకై పూనుకొన్న సంచారగ్రంథాలయోద్యమమును జయప్రదముగా కొనసాగించుటకు ధర్మవరముతాలూకాబోర్డువారు మంజూరుచేసియుండిన రు 100/ విరాళమునుత్వరలో శాంక్షన్‌చేసి యిప్పించునట్లు అనంతపురము జిల్లాబోర్డువారిని ప్రార్థించునదిగా తీర్మానించడమైనది.

(5) ధర్మవరమునందు శ్రీ క్రియాశక్తి ఒడయర్ గ్రంథాలయమునకు సుందరమందిరము నిర్మించి శాశ్వతకీర్తి నార్జించి, మన మండలమున నితరులకు మార్గదర్శకులైన శ్రీయుత బండ్లపల్లి లక్ష్మినారాయణ శ్రేష్ఠిగారికి ఈసభవారు తమహృదయపూర్వక అభివందనముల నర్పించునట్లు తీర్మానించడమైనది.

(6) ధర్మవరముతాలూకా గ్రంథాలయ సంఘమునకు ఈక్రింద కనబడిన వారలను అధికారులనుగా నెన్నుకొనునట్లు తీర్మానించడమైనది.

(7) గ్రంథాలయోద్యమమున పాటుపడుచుండిన శ్రీయుత బెల్లాం రామదాసునాయని గారి అకాలమరణమునకై ఈసభవారు తమహృదయపూర్వకసానుభూతిని వెల్లడించునట్లు తీర్మానించడమైనది.

అధ్యక్షులు—

పాట్టి శంకరరావుగారు,

ఉపాధ్యక్షులు—

బండ్లపల్లి లక్ష్మినారాయణ శ్రేష్ఠిగారు,

కారదర్శి—
రామానందుల వెంకటేశయ్యగారు

సహాయకార్యదర్శులు—
తాలూకాలోని ప్రాథమిక పాఠశాలోపాధ్యాయ కేంద్రసంఘకార్యదర్శులు,

ఇతర కార్యనిర్వాహకవర్గము.

1 కోటంపల్లి గోవిందరెడ్డిగారు
2 యాదాళం వెంకప్పశెట్టిగారు
3 పన్న రంగప్పగారు
4 న్యామద్దుల పంచాంగం ఆదెప్పగారు
5 పేరూరు రామకృష్ణరావుగారు
6 ఈడిగ వెంకటప్పగారు (కనగానపల్లె)
7 గోనుగుంట్ల లింగారెడ్డిగారు (మాల్యవంతము)
8 చిందులూరు రామచంద్రయ్యగారు
9 యర్రగుంట హనుమంతరావుగారు

సంచారగ్రంథాలయములు — వయోజనవిద్యాసేవ.

కుమారగురుకులము — మన్నారుగుడి

(ఏప్రిల్ - సెప్టెంబరు 1934 - ఈ అర్ధసంవత్సరములో నిర్వహింపబడిన కార్యక్రమము.)

సంచారగ్రంథాలయము:- సంచారగ్రంథాలయసేవ 1931 వ సంవత్సరము అక్టోబరులో ప్రారంభింపబడి 1934 సెప్టెంబరు తుదివరకు గ్రామములలో మూడుసంవత్సరములు కార్యక్రమమును నిర్వహించెను.

ఈమూడు సంవత్సరములలో సాంఘికాభ్యుదయమునకు వహించిన శ్రద్ధతో బాటు వ్యక్తిగతముగ కూడ పఠనాదికములందు ప్రత్యేకశ్రద్ధ దీసికొనబడినది. ఇట్టి శ్రద్ధ మనుష్యులను వారి యావశ్యకతలను గుర్తెరుంగజేసినది. 112 గ్రామములలో నున్న 1523 మంది ప్రజలు పుస్తకములను పఠించిరనియు, కడచిన యారునెలలలో మొత్తము 9157 పుస్తకములు పఠింపబడినవని గుర్తించుట సంతృప్తికరమైన విషయము.

సుమారు 500 చదరపుమైళ్లు గల యేడు తాలూకాలలో అనేకగ్రామములలో నీసంచారగ్రంథాలయసేవ జరిగెను.

గ్రామసంఘములు:- (అనగా 16 గురు సభ్యులకు తక్కువగాని సంఘములు) 1931 వ సంవత్సరములో 12 గ్రామసంఘములును, 1932 లో 100 ను 1933 లో 118 యును, నున్నవి. ఈ సంఖ్యయందు పరిశోధన జేయు 15 సంఘములు జేరలేదు పరిశోధన జేయు సంస్థలు నాలుగు తప్ప తక్కినవి విలయము చేయబడినవి. ఇపుడు 137 సంఘములను గలిగియున్నాము. మొత్తము 141 సంఘములలోను 112 సంఘములు చక్కగా పనిజేసినవి.

ప్రతి సందర్శనమునకును పాఠకులలో ప్రతివారును ఒక్క పుస్తకమునైనను నుపయోగించినచో నా సంఘము బాగుగ పనిచేయుచున్నదని లెక్కవేయవచ్చును. ఈవిధముగ పనిచేయుచున్నవి 112 సంఘము లున్నవి. అనగా మొత్తము 141 లో నూటికి 80 వంతు ఈ విషయములన్నియు పరికించినచో మా సేవ జనాదరణీయమై యున్నదని యొప్పుకొందురు.

కౌమార గురుకులము, మన్నారుగుడి.

1934 సం. శెప్టెంబరు అఖరువరకు గ్రామకేంద్రములను సూచించుపటము.



ఈపటములో చిన్న ఎర్రముక్కోణములు : గ్రామకేంద్రములు.

,, ,, వలయములు : సభలు జరిగిన స్థలములు.

,, ,, చతురములు : వేసవిపాఠశాలలు జరిగినస్థలములు.

మూడుపెద్దవలయములు:— మొదటిది (పెద్దది) మన్నారుగుడినుండి 12 మైళ్ల వర్తులము; రెండవది 8 మైళ్ల వర్తులము; మూడవది (చిన్నది) 4 మైళ్ల వర్తులము గలది.

90B

గ్రామసభ్యులు వారి శక్త్యనుసారము సాయపడిరి.

గ్రామసంఘములలో సభ్యులు :- పైనవివరించిన 112 బాగుగ పనిచేయు సంస్థలలో 108 రిజస్టరు చేయబడినవి. పరిశోధన జేయుచున్నవి 4 గలవు. ఈ 108 శాఖలలో 2232 మంది సభ్యులు గలరు. కాని 1463 మందియే పుస్తకము లుపయోగించుకొనిరి. అనగా మొత్తముమీద నూటికి61.65%

గ్రామములకు సందర్శనములు:— ఈ 112 సంఘములకు ఈ 6 నెలలలో 327 మార్లు సందర్శనములు జరిగినవి. అనగా సుమారు ఒక్కొక్కదానికి 3 సందర్శనములు జరిగినవి. అవి యీ క్రింది విధముగ విభాగించబడినవి.

సంఘములు	సందర్శనములు
11 పొందినవి	1
23 ,,	2
44 ,,	3
32 ,,	4
2 ,,	5

ఈ సందర్శనములు పుస్తకములు ఇచ్చుట తీసికొనుటమాత్రమే జరిగినవి. అనేక సమయములందు పుస్తకములు ఇచ్చుటకు, తీసికొనుటకు అనేక కారణములవలన వీలులేకపోయినది. అందులో నొక ముఖ్యకారణమటుల చేయుటకు కాలవ్యవధి లేకపోవుట. గ్రామస్థుడు సాధారణముగ ప్రాతఃకాలమందో లేక రాత్రికాలమందోగాని యింటివద్ద నుండడు. ఎక్కడకు వెడలునో ముందు నిర్ణయింపజాలడు. మేము పనిజేసిన యీ యారుమాసములును వివాహదినములును, వ్యవసాయదినములునై యున్నవి.

గ్రామసంఘములకు సందర్శనములు:—

	(A)	(B)	(C)
1931—32	—	92	92
1932—33	147	259	406
1933—34	100	285	385
1934—35	316	—	—

(A) ఏప్రియల్ - సెప్టెంబరు - మొదటి అర్ధసంవత్సరము.

(B) అక్టోబరు - మార్చి - తరువాతి యర్ధసంవత్సరము.

(C) సంవత్సరమునకు మొత్తము.

నిలవలో పుస్తకములు : (1) ప్రస్తుతము మావద్ద 3718 తమిళపుస్తకములు, 819, ఆంగ్ల గ్రంథములు 537 రిఫరెన్సు పుస్తకములు నున్నవి. కొన్ని హిందీ, తెలుగు పుస్తకములుకూడ నున్నవి. ఈ యారు నెలలలో నభివృద్ధి 397. వీటిలోచాలవరకు బహూకృతము. 80 రూపాయల విలువగల పుస్తకములు కొంటిమి. 1933-34 వ సంవత్సరమునకు గవర్నమెంటు వారు ఇచ్చిన 70 రూపాయలు పూర్తిగ వినియోగింపబడినవి.

ఆంగ్లగ్రంథములు చాలినన్ని యుపయోగింపబడలేదు. ఒకవేళః అవి యున్నవని యెవరికిని తెలియదేమొ. గ్రామములలో చాలమంది ఆంగ్లభాష తెలిసినవారు కలరు.

గ్రామసంఘములకు పుస్తకములిచ్చుట.

సంవత్సరము	ఇచ్చినపుస్తకములు
1931-32	1429
1932-33	5985
1933-34	5365
1934-35	—

1931-32 మొదటి అర్ధసంవత్సరములో గ్రామములో వేసవికాలపు పాఠశాలాసంచా

రము వలనను, హెడ్‌క్వార్టర్సునుండి పుస్తకములను తీసికొనుటవలనను సంఖ్యలో కొంత తగ్గుదల గానవచ్చుచున్నది. క్రమముగ పుస్తకములను ఇచ్చుటలో అభివృద్ధిగానవచ్చును.

గ్రామసంఘములలో పఠనము :- మాకిష్టములలో నిజముగా నిది యొక ముఖ్యాంశమైయున్నది. గడచినవత్సరములలో చేసిన ప్రయత్నములు పాఠకులపేర్లు వ్రాయలేదుగాన విజయవంతము కాలేదు. గడచిన 6 మాసములనుండియు పాఠశాల రిజిష్టరువలె నొకరిజిష్టరు ప్రతిసంఘమునం దుంచబడెను. ఆరిజిష్టరులలో సంచారకులు ప్రతిసభ్యుడు ఎన్ని పుస్తకములు చదివినదియు వారకు చేసి, పత్రముల (Slips) సహాయమువలన వ్రాయబడెను. ఈ 6 నెలలలో 112 గ్రామములలోనున్న 1523 ప్రజలు మొత్తము 9157 గ్రంథములు పఠించిరి. వారి సావకాశసమయము సద్వినియోగము చేయబడెను.

(3) కనీసము, చదివిన గ్రామములు:—కారణమేమైననుసరియే. మొత్తము 50 పుస్తకములకంటె తక్కువ చదివిన గ్రామములు సంతృప్తికర మైనటుల నంగీకరించుటకు వీలులేదు. ఈసంగతి వారికి తెలియజేయబడును. వారు అభివృద్ధి కనబరతురని యాశించుచున్నాము. ఈ రిమార్కుక్రిందికి వచ్చు గ్రామములు 57. అందులో 18 ఆదిద్రావిడసంఘములు. అవి తక్కువ సభ్యత్వమును కలిగియున్నవి. వానికి తక్కువ పుస్తకములీయబడును. కావున వారికి పఠించుటకు తక్కువ యవకాశమే కలదు. గనుక అది ద్రావిడులకు ప్రత్యేకశ్రద్ధ తీసుకొనబడవలెను. ఇందులో చాల భాగములకు సందర్శనములు (visits) చాలినన్ని లేవు. ఈ విషయమున కేవలము గ్రామసంస్థలను నిందించుటకు వీలులేదు.

(4) గ్రామములలో పఠనౌన్నత్యము వివిధ సంఘముల బాగును నిర్ణయించుటలో గమనించవలసిన ముఖ్యవిషయము లేవనగా- (1) పాఠకులసంఖ్య (2) సందర్శనములసంఖ్య (3) ఇచ్చినపుస్తకములసంఖ్య. ఈఔన్నత్య ప్రమాణములకు తగినశ్రద్ధ వినియోగించుచు ఒక్కొక్కసందర్శనమునను ఒక్కొక్కరు ఒక్కొకపుస్తకము చదువునటుల చేయబడెను.

వ్యక్తులపఠనముధిక:— సందర్శనమునకు 19.5. ఇది అత్యంతసంఖ్య (maximum) కడచిన యారునెలలలో 4 సందర్శనములలో ఒక్కొక్కడు చదివిన పుస్తకములసంఖ్య 50.

మా పుస్తకములు పెద్దయక్షరములు గలవి, సులభశైలి గలవి, నిరాడంబరమైనవి, 200 పేజీలకు మించనివి యుపయోగింపబడినవనిమాత్రము మరువకూడదు.

వేసవిపాఠశాలలు.

1932 లో పాఠశాల : 1932 లో వేసవి పాఠశాల 15 దినములు జరిగినది. అందున 40 మంది ప్రముఖులచే జీవితాంశము లన్నిటిమీద నుపన్యాసము లియ్యబడెను. 45 గురు పెద్దలు దానికి విచ్చేసిరి. నాలుగు సంచికలలో నుపన్యాసములు ముద్రింపించబడెను. కాని, అట్టి కొద్దికాలములో నేమియు పఠనముద్దేశించుటకు వీలులేదు.

1933 లో పాఠశాల:—1933 లో వేసవి పాఠశాలలు గ్రామములలో, 4,5 దినములు

నిర్వహింపబడినవి. సుమారు 20 ఉపన్యాసములు జీవితాంశములమీద 6 గురు ఉపన్యాసకులచే నియ్యబడినవి. అట్టివి 8 పాఠశాలలు నిర్వహింపబడినవి. మొత్తము 217 మంది హాజరైరి. వివిధసంగతులు నేర్చుకొనుటకు అభిలాషయును, ఉత్సాహమును కలుగుటకు మార్గము చూపుటకంటె వేరేమియు చేయలేకపోతిమి. ఈవిధముగ ప్రతి సంవత్సరమున మనము చేయగలిగినచో వయోజన పాఠశాల నేర్పరచుటకును 4 లేక 8 నెలలు నిర్వహించుటకును మార్గము చేకూరగలదు. నా యనారోగ్యమువలనను, దృష్టిమాంద్యమువలనను ఈ పని యీ సంవత్సరము జరుగలేదు. ఈ సంస్థల నేర్పరచుటకును, సంచారమునకును ఖర్చులు కావలసియున్నవి. కావున నిపుడు మే మట్టివి భరింపజాలము.

1934 లో పాఠశాల.—ఈ సంవత్సరమున వేసవికాలములో హెడ్ క్వార్టర్సునందు ఒక వసతిపాఠశాల నిర్వహింపబడినది. వసతికిని భోజనమునకును ఒక్కొక్కనికి రు 6 లు నిర్ణయింపబడినవి. పాఠశాల 7 వారములు జరిగినది. హరిజనులసంఘములలో చాల మంది మాంసాహారులగుటవలనను, అట్టినదుపాయము చేయలేకపోవుటవలనను 6 గురు హాజరైరి. అందులో ఒకరు మధ్యలో వెడలిపోయిరి. మిగతవారు కొద్దిదినములలో శాకాహారమున కలవడి అదియే మెచ్చుకొనిరి. చదువు ఉచితముగ చెప్పబడెను.

వారికి తమిళగద్యమునందలియంశములు పద్యవాఙ్మయము, వ్యాకరణము, పద్యములు అప్పచెప్పుట, సులభ తమిళశైలియందు ఉత్తరములు వ్రాయుట, చదువుట, నేర్పబడినవి. ప్రాథమికగణితము, సాంఘికశాస్త్రము, పారిశుద్ధ్యము, వ్యవసాయము, భారతదేశచరిత్ర, భూగోళము, శాస్త్రపాఠములు, చిత్రలేఖనముకూడ బోధింపబడినవి. పుస్తకములవలన నేర్పబడినదానికంటె నధికతరమైనది యేమన, దైనందినము వారు ప్రార్థన, దేహపరిశ్రమ, స్నాన, ప్రాతర్భోజనము, పఠనము మొదలగువానితో కాలముగడిపిరి.

మద్యపానము:—ఈ ప్రదేశమునం దెక్కువమంది నిమ్నజాతులకును, అస్పృశ్యులకును చెందినవారుగాన వారియుద్ధరణకు మొదలిడునేకార్యక్రమమైనను ముందర పానసమస్యతో మొదలిడవలెను. అపుడు విద్య యభివృద్ధిచెందగలదు. చాల ప్రదేశములలో గ్రామఫోను వల్లను మ్యాజికులాంతరువలననుకూడ ప్రజలు త్రాగియుండుటచే వాకర్షింపబడలేదు. కాన వయోజన నిరక్షరకుక్షిత్వము, మూఢత్వము పోగొట్టుకొనుటకు మితపానము ముఖ్యావశ్యకమైన దని తెలిసికొంటిమి. ఈ ప్రక్రియల్ మొదలుకొని దానికి మ్యాపులవలనను, బొమ్మలవలనను ప్రత్యేకప్రచారము జరుగుచున్నది. 20 గ్రామములలో జూలై యందును, ఆగష్టులో 29 యందును, సెప్టెంబరులో 34 యందునను, ఇంక ననేకగ్రామములలోను ప్రచారము జరిగినది

మ్యాజికులాంతరు ఉపన్యాసములు.

అధ్యక్షునియనారోగ్యమువలన మ్యాజికులాంతరు ఉపన్యాసము లిపుడు ఆపివేయబడినవి. దైవానుగ్రహమువలన నవి త్వరలోనే మరల ప్రారంభింపబడునని తలంచుచున్నాము.

కన్నప్పర్ గ్రంథాలయఅభినందనపత్రము

మదరాసు, 27-12-34

భారతశాసనసభ యెన్నికలయం దఖండ విజయమునందిన శ్రీయుత కాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారిని సన్మానించుటకుగాను రాయపురమునందలి "కన్నప్పర్" ఉచితపఠనాలయమువారు నిన్నసాయంత్రము బహిరంగసభ నేర్పరచి, సన్మానపత్రము నర్పించి సత్కరించిరి.

గ్రంథాలయసంఘమువారు నాగేశ్వరరావు పంతులుగారికి హృదయపూర్వకమగు స్వాగతమొసగుచు, ఇటీవల జరిగిన భారతశాసనసభయెన్నికలయందు వారి కట్టి బ్రహ్మాండమగు విజయ మబ్బినందుల కానందమును వెల్లడించిరి. గ్రంథాలయ భవననిర్మాణ నిధికి పంతులుగా రిదివరకే, భూరి విరాళము నొసగియుండిరి.

ఈ గ్రంథ పఠనాలయము 1929 సం॥న ప్రారంభింపబడెను. అల్పారంభమయ్యును, గత మూడువత్సరములలోను, జమీందారులయొక్కయు, పంతులుగారివంటి ఉదార స్వభావులయొక్కయు సహాయమువలన, ఇప్పటి యౌన్నత్యమునకు రాగల్గెను. హరిజన బాలబాలికలకును, వయోజనులకును ఈ గ్రంథాలయమువారు విద్యాదాన మొనర్చుచున్నారు. ప్రజలు తగినంత విరివిగ విరాళముల నొసగక యుపేక్షించుటచే, గ్రంథాలయమంత సత్వరాభివృద్ధి గాంచజాలక పోయెను. గ్రంథాలయభవననిర్మాణ మింకను పూర్తిగా లేదు సహజౌదార్యసంపన్నులగు శ్రీ పంతులుగారి దాతృత్వఫలితముగ, అచిరకాలములోనే భవననిర్మాణము పూర్తియగునని నమ్ముచున్నాము.

విజ్ఞానము - గ్రంథాలయములు *

(శ్రీ పులిజాల వెంకటరంగారావుగారు)

విద్య.

మన లక్ష్యము విద్య. మన యుద్యమ స్వభావము విద్య. అదియే మన గమ్యస్థానము. ఒకరి సుఖదుఃఖములలో నొకరు పాల్గొని విద్యావిజ్ఞానముల నార్జించుటకు సహాయపడుటయే మనకు గావలసినది. అదియే మనమూలసూత్రము. అదియే మనము తరించుటకుగల సాధనములను సమకూర్పగలదు.

గ్రంథములను జదివినపండితులుగాని, విశ్వవిద్యాలయమువారిచే పట్టములను బడసినవారుగాని, విద్యావంతులు గాజాలరు. అతిసూక్ష్మములగు ఆధ్యాత్మిక లక్షణములను, ఆపదలలో శాంతమును, సజ్జనస్థలములో నానందమును, లోకవ్యవహారములయందు నిష్కాపట్యమును, సంపూర్ణమగు నుచితానుచిత విచక్షణము, న్యాయానుసార

* నిజామురాష్ట్ర తృతీయాంధ్రమహాసభాధ్యక్షులుగ నొసంగిన యుపన్యాసమునుండి.

బుద్ధియు, నైతికస్థైర్యమును, కార్యదీక్షయు ఎవరి కుండునో వారే విద్యావంతులు. వివిధజాతి సమ్మేళనమగు హిందూ దేశనిర్మాణమునకు సహాయపడుటయే విద్యాభ్యాస ప్రయోజనమైయుండవలయును. దానిప్రయోజనము మన జీవితరహస్య మెఱుంగుటయే. విద్యార్థిజీవనమునందు ప్రకృతి, మానవకోటి, దేశము మొదలగు భావములు తరంగితము లగుచుండవలయును.

ప్రతిమానవుడును విద్యార్థి. ప్రపంచమే యాతనికి విద్యాలయము. విద్యార్థులకు తా మేమిచేయవలయునో నేర్పునది విద్య. స్త్రీలకు గృహనిర్వహణకౌశలమును కలిగించునది విద్య. వృత్తిపరులకు తా మెట్లు ప్రవర్తింప వలయునో చెప్పునది విద్య. ప్రజలకు తమ ధర్మమును బోధించునది విద్య. వారికి తమ హక్కులను ప్రసాదించునది విద్య. రాజులకు రాజ్యాంగమును చూపించునది విద్య. ఉద్యోగులను తమకర్తవ్యమునకు బురికొల్పునది విద్య. మతకక్షలను మాన్పునది విద్య. సాంఘికదురాచారములను బోద్రోలునది విద్య. వేయేల? బాలురకును బాలికలకును, యువకులకును యువతీమణులకును, పాలించు రాజునకును రాజోద్యోగులకును పాలింపబడు రైతులకును, తమతమ విధ్యుక్తధర్మమును బోధించి ఉద్ధరించునది, వ్యక్తిత్వమును పెంపొందించునది, మన ప్రవృత్తి నుద్రేకింప జేయునది, స్వయంసహాయమును, ఏకాగ్రతను సమకూర్చునది విద్య. ఇట్టివిద్యను సాధించుటయే మన పరమావధి.

గ్రంథాలయములు, పఠనమందిరములు.

మన హైదారాబాదునందు మాత్రము సర్కారుప్రాపున నొకగ్రంథాలయము విజ్ఞాన వీచికలను వెదజల్లుచున్నది. కాని బహుజన సంఖ్యగల హైద్రాబాదునగరమున కీ గ్రంథాలయము చాలదనిన తప్పుగాదు. ప్రజాపక్షమున అచటచట కొన్ని గ్రంథాలయములు, పఠనమందిరములు స్థాపింపబడినవి. కాని అవి పోషింపబడనందున నూటికి ౯౦ చో॥ శిథిలమై మగ్గుచున్నవి. సాగుచున్న గ్రంథాలయములయందైనను చదువువారి సంఖ్య మిక్కిలితక్కువ. సామాన్య గ్రంథాలయములే శూన్యమైనపుడు సాంకేతిక గ్రంథాలయములుగాని, ప్రత్యేకకళలను బోధించు గ్రంథములుగలిగిన ఆలయములుగాని, సంచార గ్రంథాలయములుగాని యెట్లుండగలవు? అదేమి దురదృష్టమోగాని యింతవరకు గ్రంథాలయములపై మనప్రభుత్వమువారు తమ కరుణాదృష్టిని బ్రసరింపజేయలేదు. మన సర్కారు వారు ఈ విషయమై బరోడాసంస్థానము వారిపద్ధతి ననుసరించిన చాల ఉపయోగకరముగా నుండును.

నిర్బంధప్రారంభవిద్యయు, యువతీయువకవిద్యయు, గ్రంథాలయములను ఆయా ప్రాంతములయందుగల దేశభాషలలో ఎంతవరకు స్థాపించబడవో గ్రామజీవనముగల మనప్రజలలో వారిజీవితవిధానము ననుసరించి వారి కవసరమున్న విద్యాప్రణాళికయును, పట్టణజీవితముగలవారికి వారిస్థితిగతుల కనుకూలించు విధానమును స్త్రీపురుషులకు ప్రత్యేకముగా ఎంతవరకవలంబింపబడదో అంత వరకు నిశ్చయమైన అభివృద్ధి అసంభవము. ఇట్టి మార్గములు తక్షణమే అవలంబించినను దేశమున విద్య ప్రబలుటకు దాదాపు ౫౦ సంవత్సరములు కావలయును. ఈమధ్య నేను శ్రీరాజ రాజ నరేంద్రాంధ్రభాషా

నిలయరజతోత్సవమునకు హనుమకొండ వెళ్లియున్నపుడు, ప్రజానురంజకులును, విద్యాప్రియులు నగు నక్కడి సుబేదారు ఆలి జనాబు మోల్వీ అబ్దుల్ బాసిత్ ఖానుగారు ఒక గ్రంథాలయమును స్థాపించనున్నారని వినియుంటిని. వారు ఇట్టి ఆదర్శపూర్వకమైన గ్రంథాలయమును స్థాపించి యితరులకు మార్గదర్శకు లయ్యెదరని నమ్ముచున్నాను.

పైన సూచింపబడిన విషయములు ప్రభుత్వపక్షమునగాని, ప్రజాపక్షమునగాని ఎంతవరకవలంబింపబడవో అంతవరకు మనము విద్యావిషయమున వెనుకకు నడచుచున్నామని చెప్పవచ్చును. మనకొఱకై విజ్ఞానము నార్జించి, మనప్రభుత్వము కొన్ని గ్రంథములలో దాచి మనకు పంచకజ్జాయమువలె బంచిపెట్టునవి యనుకొనుట మన వివేకితాశూన్యమున కొక నిదర్శనము. మనము మన కాళ్లపైననే నిలబడవలసియున్నది.

గ్రంథాలయాభివృద్ధి. *

(శ్రీ అయితరాజు జీడికంటి రామారావుగారు)

విద్యకు వికాసమును గల్పించునవి గ్రంథాలయములు. గ్రంథాలయములు భాషాప్రయుక్తములు. దేశాభివృద్ధికి భాషాభివృద్ధియే ముఖ్యసాధనము. భాషాసమన్వితములగు వివిధవిజ్ఞాన ప్రబోధగ్రంథరాశితో భాసిల్లునవి గ్రంథాలయములు. ఈలాటి గ్రంథముల బఠించుటవలన మానవున కనేకవిషయములందు తెలివితేటలు గలిగి, అనుభవవిజ్ఞానసంపత్తి చేకూరనున్నది గావున నీగ్రంథాలయములు గ్రామగ్రామమున నెలకొల్పబడు టధికావశ్యకము. దీనివ్యాపనకై యిదివరకు కేంద్రసంఘమువారు చాల కృషిసల్పి జిల్లాలలో నూటముప్పదిదాక గ్రంథాలయముల నెలకొల్పించిరిగాని యవిగూడ నిప్పుడు మందగించియున్నవి కొన్ని గ్రంథాలయము లంతరించినవి. కావున వీనిపునరుద్ధారణకును నూతనగ్రంథాలయస్థాపనకును, గ్రంథాలయోద్యోగమును బోధించుటకును విశేషప్రచారము మరల సాగించుటకును ప్రయత్నించవలసియున్నది. ఈగ్రంథాలయోద్యమమునకు సరియైన ధనసహాయము లభించకపోవుటవలన నీయుద్యమముతగ్గిపోవుచున్నది.

పాఠశాలలకువలె గ్రంథాలయవ్యాప్తికిని, వానిపోషణకును కొంతమొత్తము ప్రభుత్వమువారు వినియోగించినచో విద్యాభివృద్ధికై సమగ్రప్రయత్నమొనర్చినదానిలో జేరును.

గ్రంథాలయస్థాపనావ్యయమును భరింపజాలని పల్లెలలో విజ్ఞానవ్యాప్తికై సంచారగ్రంథాలయముల నేర్పరచి తద్ద్వారా విద్యాప్రచారముసులభముగా జేయవచ్చును.

* నిజాంరాష్ట్ర తృతీయాంధ్ర మహాజనసభ అహ్వానసంఘాధ్యక్షులుగ ఇచ్చిన యుపన్యాసమునుండి.

గ్రంథాలయములు - వాని యావశ్యకత. *

(పప్పూరు రామాచార్యులుగారు)

ఈ నెల 19 వ తేదీ సాయంకాలము రాణీ సత్రములో తిమ్మనచెర్ల జనార్దన గ్రంథాలయ వార్షికోత్సవము శ్రీమాన్ పప్పూరు రామాచార్యులవారి అధ్యక్షతలో జరిగెను. మ. రా. శ్రీ కె. వెంకోబరావుగారును ఆర్. విశ్వంగారును ఈ గ్రంథాలయవార్షికోత్సవ విషయమున నెక్కువశ్రద్ధపూని పనిజేసిరి. శ్రీయుతులు కల్లూరు సుబ్బరావుగారును, బందరు నుండివచ్చిన చెలుకువాడ వేంకటనరసింహంగారును సభనలంకరించిరి. కార్యదర్శి నివేదిక అధ్యక్షునికిసన్మానపత్రము సమర్పింపబడినవెనుక, కల్లూరు సుబ్బరావుగారు మాటాడుచు నేటికాలమున రామకృష్ణాలయములకంటె మిన్నగా మనము సరస్వతీఆలయములను పోషింపవలసినదనియు గ్రంథాలయములే అట్టి సరస్వతీ యాలయములనియు నుడివిరి. చెలుకువాడ వేంకటనరసింహము గారు తమ సహజ గంభీరధోరణి నుపన్యసింపుచు మనము మనపుత్రులయొక్కయు పుత్రికలయొక్కయు బాహ్యశరీరపోషణమునకై వేనవేలు వెచ్చింపుచుంటిమనియు దానికాధారమగు మనస్సు బుద్ధి ఆత్మ వీనియభివృద్ధికి ధనము వెచ్చించుటకు వెనుదీయుచుంటిమనియు, బాలురకు ధర్మము నీతి, పుణ్యము నేర్పుట తలిదండ్రుల ధర్మమనియు, తండ్రిహరి జేరుమనియెడు తండ్రి తండ్రి అని ప్రహ్లాదచరిత్రలోని నుడి తథ్యమనియు నుడివిరి. జనులు మూఢులై రామకోటి మొదలగు వ్యర్థకార్యములలో నిమగ్నులగుచుండిరనియు, సత్యధర్మశౌచములను మనలో వృద్ధి పొందించు కార్యములను చేయుటలో మనకు ముక్తి యున్నదిగాని ఆడంబరముకోసరము చేయు కార్యములవలన ముక్తి కలుగదనియు గ్రంథాలయము వృద్ధినొంది గ్రామములలో మంచి స్థానము నాశ్రయించుకొన్న వెనుక గ్రామాభివృద్ధి కార్యములను తర్వాత జేయసులభసాధ్యమనియు నుడివిరి.

అధ్యక్షోపన్యాసము.

గ్రంథాలయముల పోషించుట గ్రంథాలయవార్షికోత్సవములు జరుపుట ఈ కాలమున విశేషముగా వినుచున్నాము. కాని మనదేశములో నవి ఇంకను చాలవు. ఇతర రాజ్యములతో పోల్చి చూచినయెడల మన గ్రంథాలయోద్యమ మింకను శైశవదశలోనే యున్నది. ధనము గలవారు దీనిని పట్టుకొని సాహాయ్యము చేయకుండుటే ఇందుకు కారణము. వారు దానములు చేయుచునే యున్నారు గాని పాత్రాపాత్రావివేచనము లేక చేయుచున్నారు. ధర్మములు కాలదేశపాత్రములనుబట్టి మారుచుండును. నీళ్ళుదొరకని గుంతకల్లువంటి ప్రదేశములలో బావులు త్రవ్వించుట పుణ్యకార్యము కావచ్చును. కాని ఏగంగానదీతీరమందో బావిని త్రవ్వించుటవలన పుణ్యమురాదు అక్కడ నది యనవసరము. కాశీయాత్ర పోవువారికి మార్గమధ్యమున అన్నసత్రము లుంచుట పుణ్యముగా భావించ

* అనంతపురంజిల్లా "తిమ్మనచెర్ల" యందున్న శ్రీ జనార్దన చిత్రగ్రంథాలయ వార్షికోత్సవసమయమున ఇయ్యబడినది.

బడుచుండెను. ఇప్పుడు కాలినడకను ప్రయాణము చేయుట అరుదు. పైగా ఎక్కడను హోటలులు ఎక్కువగా నున్నవి. కావున అన్న సత్రములవలన నిప్పు డెక్కువ యుపయోగము కనుబడదు. బీదల కన్నదానము చేయుమాట కాదు. అది ఎప్పటికిని అవసరమే. పూర్వపద్ధతిని అన్నసత్రము లుంచుట ఇప్పుడనవసరము. ఈ విధముగా దానముగూడ దేశకాలములను గుఱించి మారును. ఇప్పుడు అత్యవసరముగా దానము చేయవలసినది జ్ఞానము. జ్ఞానదానమువంటి దానము వేరొకటి యుండదు. గ్రంథాలయములు కట్టించుట, పత్రికలను తెప్పించియిచ్చుట గ్రంథముల కొనియిచ్చుట, గ్రంథములను వ్రాయించి గ్రంథకర్తలను పోషించుట ఇత్యాదు లిప్పుడు జరుగవలసిన పనులు.

పూర్వ మెట్లుండెనో యేమోగాని ఇప్పుడు ప్రపంచము ముఖ్యముగా మన దేశము దుఃఖమయముగా నున్నది. జీవికలు గడచుట కష్టము; దేశము దారిద్ర్యమున మునిగియున్నది. ఏవృత్తిలోను పోటీ. ఎవ్వరికిని సుఖము లేదు. కాని మానవుడు సుఖముకొరకు వెంపరలాడుచుండును. దుఃఖమును మఱచి తాత్కాలికసుఖము ననుభవించుటకు ప్రయత్నించును. త్రాగుట, జూదము, సిగరెట్టుకాల్చుట, సినిమాలు ఇవి అన్నియు తాత్కాలికసుఖము నిచ్చుననుటకు సందేహము లేదు మనుజునకు కష్టము లెక్కువైనకొలది హృదయములో శాంతి తక్కువై ఇట్టి తాత్కాలికసుఖములకొరకు ప్రయత్నించును.

కాని ఇవి ఆనందము నిచ్చునవి కావు. తాత్కాలిక సుఖములు త్రాగిన రెండుఘడియలు వానికి బాగుగ నుండవచ్చును గాని తర్వాత వాడా దుఃఖమును ఇబ్బడిగా ననుభవించవలసినదే. అట్టి తక్కిన సుఖములు. అవి మనుజునకు శాంతము నియ్యజాలవు. సుఖము తాత్కాలికము, ఆనందము శాశ్వతమైనది. అట్టి ఆనందమువంక దృష్టిపడినచో మనుష్యుడు తుచ్ఛసుఖముల కాశింపడు. ఆనందము మనస్సునకు శాంతినిచ్చును. అది సద్గ్రంథపఠనమునగాని వేరువిధముగా లభించదు. సజ్జనుల గోష్ఠివలన గూడ నది కొంతవరకు లభింపగలదు. ఈరెండును గ్రంథాలయమున మనకు లభింపగలవు.

కవులు తమ భావములను కావ్యరూపమున నుంచినారు. కవి గ్రంథము నొక్కటిగ్గొన్నచో వాని జీవితములోని సారాంశము నంతయు గ్రహించినట్లే. గ్రంథాలయములో శతాబ్దములు వెనుకనున్న మహాకవులను మనము కలిసికొని వారితో సంభాషింపవచ్చును వారు నిష్పక్షపాతముతో నిస్వార్థదృష్టితో మనకు నీతి నుపదేశింపగలరు.

పూర్వమువలె గ్రంథపఠన మిప్పుడంత కష్టము కాదు. తాటియాకుల గ్రంథములుగాక నేడు చక్కని ముద్రితప్రతులు సులభముగా లభించుచున్నవి. మనము వానిని వినియోగించుకొని లాభముల బడయవలెను.

పేదలందరు గ్రంథాలయములకు చందాలివ్వ్గన నియ్యరు. ఉచిత గ్రంథాలయము తేర్పరుచుట ఐశ్వర్యవంతులకు విధి. పేదవారి కష్టమువలననే సాహుకారు లైశ్వర్యవంతులైనాడు. కావున వారికి సుఖమును వినోదములను, జ్ఞానమును, కల్గించుట ధనికులకు విధి. పూర్వమున ధనవంతులే పురాణములు, హరి

కథలు తోలుబొమ్మలాటలు, బయలునాటకములు మొదలగువానిని ఆడించుచుండిరి. పేదలందరు టిక్కెట్టులేకనే చూచివిని ఆనందము జ్ఞానమును సంపాదించుచుండిరి. ఇప్పుడు నాటకములకు సినిమాలకు టిక్కెట్లున్నవి. పేదలు పోవుటకు వీలులేదు, కావున వారికి జ్ఞానసాధనములు కొఱవడినవి. దేశము మరింతఅజ్ఞానములో బడిపోవుచున్నది. జనులనీతి క్రమముగా తగ్గి భక్తి విశ్వాసములు అదృశ్యములైనవి.

కావున ధనవంతులమీద బాధ్యత హెచ్చుగా గలదు. వారు తమసొమ్మును స్వార్థమునకు వినియోగించి తామే జ్ఞానవంతులు విద్యావంతులగుటకు ప్రయత్నించినచో లాభములేదు. వేయిమంది అశుచిపరులలో ఒక్కడు ఆచారవంతుడుండిన వాని ఆచారము నిలువదు. కావున సాధ్యమైనంత మందికి విద్యాదానము చేయుట అందరికిని విధియై యున్నది. వీనికి ముఖ్యసాధనములు గ్రంథాలయములే. రష్యాలో బీదలందరికిని ఉచితసినిమా నాటకశాల లేర్పఱుప బడినవి. వానిమూలమున వారు జ్ఞానమును సంపాదించుచున్నారు.

తెనుగున నెన్నియో గ్రంథములు లేవు. మీరు చుట్టకు సిగరెట్టునకు వ్యయముచేయు ధనములో 6 వ పాలు వ్యయముచేసినచో దివ్యమైన గ్రంథాలయ మేర్పడగలదు. జనుల నాకర్షించునిమిత్తము గ్రంథాలయములలో పురాణములు, హరికథలు చెప్పించవలెను. రేడియో ఒక్కటి నుంచిన ప్రపంచపువార్తలన్నియు తెలియుచుండును. పత్రికలు చదివి వినిపించుట కేర్పాటుచేయవలెను. వ్యాయామశాల లేర్పాటుచేసి యువకుల నాకర్షించి వారికి జ్ఞానాభివృద్ధితో పాటు దేహారోగ్యాభివృద్ధికూడ కల్గింపవలెను.

మనదేశములో పలువురు చదువనేర్చినారు గాని రచనాశక్తి చాలమందికి తక్కువ పండితులుగూడ నాలుగు పంక్తులు నిర్దుష్టముగా వ్రాయజాలరు. వ్రాయగలవారు సోమరులై రచనాశక్తిని వృద్ధిచేసికొనరు. కావున పోటీపరీక్షలు వ్యాసరచనాపరీక్షలు పెట్టి గ్రంథాలయములు చదువరులలో రచనాశక్తి వృద్ధిచేయవలెను.

ఇట్టి కార్యములన్నియు చేసి, గ్రామమునందు గ్రంథాలయములు జ్ఞానజ్యోతివలె ప్రకాశించి జనులకు అనేకవిధముల ఉపయోగించవలెను. మీ గ్రామమునందు జనులెల్లరు సాయపడి ఈ జనార్ధన గ్రంథాలయమును సర్వవిధముల వృద్ధి పొందింతురుగాక.

ఏలూరులోని మూడు ధర్మసంస్థలు

(ఉచితము.)

1 హిందూ యువజనసంఘ గ్రంథాలయము

(Y. M. H. A.) (స్థాపితము 1904 సం॥ రం.)

2 అన్న, వస్త్ర, వైద్య, విద్యాదాన సమాజము

(స్థాపితము 1913 సం॥ రం.)

3 గోసంరక్షణసమితి

(స్థాపితము 1918 సం॥ రం.)

సంవత్సర రిపోర్టులు, రూల్సుబుక్కులు, కరపత్రములు, బ్యాలన్సుషీట్లు మున్నగునవి రు 10 రూపాయలు లగాయతు శాశ్వతనిధి ధర్మముయిచ్చి రశీదులును ప్రత్యేకం పట్టాలను 5 గురు శాశ్వత ధర్మకర్తలు (రు 500 ల దాతల సంతతికములతో పుచ్చుకొన్నవారికి ఉచితముగా సప్లయి చేయబడును. ఎల్లరు యథాశక్తిని సహాయపడ ప్రార్థన.

ఇతరవివరములకు:—

మద్దుల వేంకట చినరాజు శ్రేష్ఠి,
శాశ్వత ధర్మకర్త.

ఉదయిని.

సాహిత్య పత్రిక.

'ఉదయిని' లో చక్కని కావ్యాలు, కథలు, నాటకాలు, హాస్యాలు, విమర్శవ్యాసాలు— అందమైనవీ, ఉత్కృష్టమైనవీ రచనలు ప్రకటితమవుతాయి.

'ఉదయిని' చదవడం మనస్సుకి ఆరోగ్యమూ, అలంకారమున్నూ.

'ఉదయిని' వంటి పత్రిక తెలుగులో మరొకటి లేదన్నారు చదువుకొన్న రసజ్ఞులు.

కార్యాలయం: 15 ఆదెప్ప ముదలివీధి, మద్రాసు.

విజ్ఞానచంద్రికయందు ప్రకటింపబడిన

హిందూ మహాయుగము

కొమర్రాజు లక్ష్మణరావు ఎం.ఏ. గారిచే రచియింపబడినది. వెల రు 1—8—0

బౌద్ధ మహాయుగము

వేలూరి సత్యనారాయణ ఎం. ఏ. గారిచే రచియింపబడినది.

వెల క్యాలికోబైండు రు 2—0—0
రేపరుబైండు రు 1—8—0

జడకుచ్చులు

రాయప్రోలు సుబ్బారావుగారిచే రచియింపబడినది. వెల రు 1—0—0

మేనేజరు,
ఆంధ్ర గ్రంథాలయప్రెస్, బెజవాడ.

ప్రకృతి

స్వాభావిక ఆరోగ్య సచిత్ర మాసపత్రిక.

ఆరోగ్యనియమములను - మందు, శస్త్రములతో నిమిత్తములేని స్వాభావిక చికిత్సా విధానములను, స్వాభావిక జీవనమును బోధించును. సంవత్సరచందా రు 3-0-0

మేనేజరు,
ప్రకృతి కార్యాలయట్రస్టు, బెజవాడ,

జ్వాల మాసపత్రిక—బెజవాడ

విడిపత్రిక ఒక అణా - సం॥ చందా రూపాయి

శతాబ్దాల ఆచారం మానసిక బానిసత్వంగానూ, మతాభిమానం వల్లమందుమత్తుగానూ అయి నిస్తేజంగా, నీరసంగా స్వతంత్రిత వివిధంగానూ లేని సంఘానికి అలవడి, తిరుగుబాటు సత్యాన్ని నిండుకన్నులతో చూడగలధైర్యం కావాలి. జ్వాల ఉద్దేశం ఇది.

గ్రంథాలయ సర్వస్వము

చందా: ఆంధ్రదేశగ్రంథాలయసంఘ సభ్యులకు సభ్యత్వచందాతో రు 3 లు మాత్రమే.

ప్రతినెల 1-వ తేదీన వెలువడును

వ్యాసములు

గ్రంథాలయ శాస్త్రము-ఆంధ్రవాఙ్మయము-ఆంధ్రాభ్యుదయములను గూర్చిన అనుభవ పూర్వకములైన వ్యాసములు, గ్రంథాలయ సంఘములయొక్క నివేదికలు, వృత్తాంతములు, గ్రంథముల విమర్శనములు ఇందు ప్రకటింపబడును.

పటములు

గ్రంథాలయ భవనములయొక్కయు, గ్రంథాలయ సభలయొక్కయు, గ్రంథాలయ సేవకులయొక్కయు, పటములును, ఆంధ్రాభ్యుదయ బోధకములగునట్టి పటములును ఇందు ముద్రింపబడును.

గమనింపుడు

ఈ పత్రిక ప్రతినెల 1-వ తేదీన వెలువడును. కావున వ్యాసములను పంపువారు ఏనెల పత్రికయందు ప్రకటింపవలెనో దానికి వెనుకటినెల 15-వ తేదీకి పూర్వమే పంపవలయును. పటములను వెనుకటినెల 1-వ తేదీకి పూర్వమే పంపవలయును.

ప్రకటన రేట్లు

ఒకసారి 1 పుటకు	రు 20-0-0
ఒకసారి $\frac{1}{2}$ పుటకు	రు 12-0-0
ఒకసారి $\frac{1}{4}$ పుటకు	రు 6-0-0

రాజపోషకులు

శ్రీరాజా వేంకట కుమారమహీపతి సూర్యారావు బహద్దరుగారు
శ్రీరాజా నాయని వేంకట రంగారావు బహద్దరుగారు
బెల్లంకొండ రాఘవరావుగారు, అగ్రహారందారు
ముదుల వేంకట చినరాజు శ్రేష్ఠిగారు, ఏలూరు.
గోపు రామచంద్రరావుగారు, బెజవాడ.

వివరములకు:—

గ్రంథాలయ సర్వస్వకార్యస్థానము,
బెజవాడ.

RSVM01 A149

Grandhalaya Sarvasvam - Registered No M. 1714 30

ఆంధ్రభూమియందు ప్రథమమున స్థాపింపబడినది.

ఆంధ్ర ప్రావిడెంటు కంపెని, లిమిటెడ్

ప్రధానకార్యస్థానము : బెజవాడ

(స్థాపితము 1929)

మేనేజింగు డైరెక్టరు :

మహారాజశ్రీ దిట్టకవి వీరరాఘవయ్యపంతులుగారు

స్వల్ప ప్రీమియములు !　　　　నవీన పద్ధతులు !

ప్రత్యేక సౌకర్యములు

1 స్త్రీ పురుషులకు సమానమైన ప్రీమియము రేట్లు
2 రు 100 లు మొదలు రు 500 వరకు పట్టాలు జారీచేయబడును
3 వైద్యపరీక్షలేని భీమాపద్ధతులు
4 క్లెయిములు గ్యారంటీ చేయబడినవి
5 పట్టాదారులకు ఋణము లియ్యబడును
6 జననభీమాలో నెలకు రూ 1 లేక 2 రూపాయలు ప్రీమియము చెల్లించిన రు 500 లేక 1000 రూపాయలవరకు క్లెయిములు పొందవచ్చును. కవల పిల్లలు జనించిన రెండు క్లెయిము లొసగబడును.
7 ఉత్తర ప్రత్యుత్తరములు తెలుగున జరుపవచ్చును.
8 పట్టాదారులకు ఫలప్రదమును సహాయకరమునగు సేవయే ఆదర్శము

ఏజంట్లకు

ధారాళమైన కమీషను యివ్వబడును

జననభీమా శిశుపోషణకు గొప్పసహాయకారి

పూర్తివివరములకు:— సూపరింటెండెంటు ఆఫ్ ఏజన్సీస్,
ఆంధ్ర ప్రావిడెంటు కంపెని, లిమిటెడ్,
గాంధినగర్, బెజవాడ.

బెజవాడ ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాలయందు క. కోదండరామయ్యగారిచే ముద్రింపబడినది.

	మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	RSVMOI A 149
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	7/6/24
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	39
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	II, 20B
లేని పేజీలు	NO
తయారు చేసినది	Sandhya
పేజీలు విడదీసినది	Sandhya
స్కాన్ చేసినది	sandhya
పరీక్ష చేసినది	pragathi
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	No
పరిస్థితి	good